సంచలన వార్తా పత్రిక
లీడర్
SANCHALANA VAARTHA PATRIKA LEADER

Read / Share / Follow
www.leaderepaper.com
www.facebook.com
/leaderramanamurthy/

గురువారం • 1 ఫిబ్రవరి 2018 । సంపుటి : 20 సంచిక : 185 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00
Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

ఆలయాలకు గ్రహణం



చంద్రగ్రహణం సందర్భంగా నగరంలో ఉదయం 9 గంటల నుండి ఆలయాలు మూసివేశారు. ఈ సందర్భంగా విశాఖలో సంపత్ వినాయక గుడిని మూసి వేసిన దృశ్యం. - న్యూస్‌లీడర్ / విశాఖపట్నం

3లో

ఫీజు కట్టలేక ప్రాణం తీసుకుంది





విశాఖలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- ఫీజు కోసం చైతన్య యాజమాన్యం వేధింపులు
- ఆమె తండ్రి పొట్ట కొట్టిన ట్రాఫిక్ పోలీసులు

న్యూస్‌లీడర్ @ విశాఖపట్నం

ట్రాఫిక్ పోలీసులు ఆమె తండ్రి ఉపాధిపై దెబ్బకొట్టారు... ఫీజు చెల్లించలేదనే కారణంతో చైతన్య కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్ ఇవ్వకుండా వేధించింది...పరీక్ష రాయకపోతే ఇక భవిష్యత్ ఉండదనే భయంతో పాపం ఆ విద్యార్థిని ఏకంగా ఉసురు తీసుకుంది. కాదు..కాదు..ఆమె ప్రాణం తీసుకునేలా చేసింది చైతన్య కాలేజి యాజమాన్యం, ట్రాఫిక్ పోలీసులు ఆ కుటుంబం ఉసురు పోసుకున్నారు. నగరంలోని లలితానగర్‌లో నివసించే గ్రంధి తేజశ్విని అనే ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్య ప్రస్తుతం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వివరాలు పరిశీలిస్తే తేజశ్విని తండ్రి శ్రీనివాస్ జీవీఎంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం సమీపంలో ఫుట్‌పాత్ బట్టల దుకాణం నిర్వహిస్తాడు. దానిపై వచ్చే ఆదాయంతోనే జీవిస్తూ కూతుర్ని చైతన్య కాలేజిలో చదివిస్తున్నాడు. అయితే గత 11రోజుల క్రితం అక్కడ ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు కొరడా ఝులిపించారు. జీవీఎంసీ కమిషనర్ వద్దన్నందున దుకాణాలు తీసేయాలంటూ వారిని వ్యాపారాలు చేసుకోనివ్వలేదు. కానీ అతడికి హాకర్ గుర్తింపు కార్డు ఉంది. ముద్ర రుణం తీసుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు. శ్రీనివాసరావుకు మిగతా 2లో ▶

నోరు మెదపని చైతన్య యాజమాన్యం

తమ కళాశాల విద్యార్థిని తేజశ్విని ఫీజు కోసం తాము పెట్టిన వేధింపుల వలనే ఆత్మహత్య చేసుకుందని తెలిసినా చైతన్య కాలేజి యాజమాన్యం నోరు మెదపడం లేదు. ఒక విద్యార్థిని చనిపోయిందని కనీసం మానవతాదృక్పథంతో కూడా వారు స్పందించలేదు. కేవలం డబ్బులే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. చైతన్య తీరు పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అందరిదీ అదే పరిస్థితి..



జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలను ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడంతో అక్కడ వ్యాపారాలు చేసుకుం టున్న వారంతా గడిచిన 11రోజులు నానా ఇబ్బందులు పడ్డారు. వ్యాపారులు నిరసన వ్యక్తం చేశాక కమిషనర్ హాకర్స్ జోన్ ఏర్పాటు చేసే వరకు వ్యాపారాలు చేసుకోమని అనుమతిచ్చారు. అయితే హాకర్స్‌జోన్ లేని మిగతా 2లో ▶

సైకిల్‌కు రూట్ క్లియర్

సైక్లిస్టుల కోసం ప్రత్యేక ట్రాక్‌లు

స్మార్ట్ స్ట్రీట్ ప్రోగ్రాం కింద త్వరలో మరిన్ని ట్రాక్‌లు • ఫలితాన్నిస్తాయంటున్న నిపుణులు

న్యూస్‌లీడర్ @ విశాఖపట్నం

సైకిల్ తొక్కడం వల్ల శరీరానికి మేలు జరుగుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ఉదయాన్నే సైకిల్ రైడ్ చేస్తే శరీరంలోని కండరాలు బాగా పనిచేసి రక్తప్రసరణ జరిగి శరీరం మొత్తానికి మంచి జరుగుతుందని అంటున్నారు. అయితే సైకిల్ తొక్కే వారికే కాకుండా అందరికీ ఆరోగ్యం చేకూరుతుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. నిజమే సైకిల్ తొక్కడం అంటే మోటార్ మిగతా 2లో ▶



ఆల్‌ఇండియా రేడియో వెనుక రోడ్డులో ..

జీఎస్‌టీ శకంలో తొలి బడ్జెట్

ప్రత్యేక ప్రతినిధి



కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వ చివరి పూర్తిస్థాయి బడ్జెట్ రేపు ప్రవేశపెట్టబోతున్నారు. ఇప్పటివరకు అత్యధికంగా పదిసార్లు బడ్జెట్ సమర్పించిన రికార్డు, దేశ నాలుగో ప్రధానిగా పనిచేసిన మొరార్జీ దేశాయ్‌ది. ఎనిమిది బడ్జెట్లతో చిదంబరం, తలా ఏడు బడ్జెట్లతో ప్రణబ్ ముఖర్జీ, యశ్వంత్ సిన్హా, వైబీ చవాన్, సీడీ దేశ్‌ముఖ్‌లు తరవాతి స్థానాల్లో నిలుస్తారు. వరసగా అయిదు బడ్జెట్లు సమర్పించినవారి జాబితాలో డాక్టర్ మన్మోహన్ సింగ్, యశ్వంత్ సిన్హా ఉన్నారు. కొత్తగా జైట్లీ ఆ వరసలో మిగతా 2లో ▶

ఉత్తర భారతంలో భూకంపం



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ నగరాన్ని బుధవారం మధ్యాహ్నం 11.40 గంటల ప్రాంతంలో భూకంపం వణికించింది. ఇళ్ళు, కార్యాలయాల్లోని వస్తువులు పెద్ద చప్పుడు చేస్తూ ఊగిపోయాయి. ఢిల్లీ- దేశ రాజధాని ప్రాంతంలో కొద్ది సెకండ్లపాటు భూమి కంపించింది. ప్రజలు భయాందోళనతో వీధుల్లోకి పరుగులు తీశారు. తమ ఆత్మీయులకు ఫోన్లు చేసి, యోగక్షేమాలను వాకబు చేశారు. ఉత్తర భారతదేశవ్యాప్తంగా భూమి కంపించినట్లు ప్రాథమిక సమాచారం ప్రకారం తెలుస్తోంది. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, జమ్మూ-కశ్మీరులోని శ్రీనగర్‌లలో కూడా భూమి కంపించినట్లు సమాచారం. దిగ్భ్రాంతికి గురైన ప్రజలు మిగతా 2లో ▶

అర్హత లేకున్నా ఐలా కమిషనర్‌గా..

జిల్లాను ఇంకా వీడని వేణుగోపాల్

ఐలా భూముల విషయంలో తనదైన శైలి

అవినీతి పరుడికి ఆ పదవి ఎలా ఉంచుతారంటూ విమర్శలు

గాజువాక, న్యూస్‌లీడర్:



గాజువాక తహశీల్దార్‌గా వేణుగోపాల్‌ను పంపేసినా ఇంకా ఐలా కమిషనర్ పదవిమాత్రం అతని దగ్గరే ఉంది. ఆ పదవిలో ఉండడానికి అవసరమైన అర్హతలు లేకపోయినా ఆయన్ను ఆ పదవిలో కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. ఐలా కమిషనర్‌గా ఉండాలంటే ఆ వ్యక్తి టెక్నికల్ విద్యార్హతలు కలిగి ఉండాలి. అలాగే అడ్మినిస్ట్రేషన్‌లో కూడా దిట్ట అయి ఉండాలి. కానీ వేణుగోపాల్‌కు ఈ రెండూ కొరతే. గాజువాక ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా విధుల నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆదివారం ఆఘమేఘాలమీద తహశీల్దార్ బాధ్యతల నుంచి వైదొలిగిన విషయం విధితమే. లీడర్ వరస కథనాలకు స్పందించిన జిల్లా కలెక్టర్ తహశీల్దార్ వేణుగోపాల్‌ను ఆదనపు బాధ్యతల విధులనుంచి తొలగిస్తూ హెచ్‌డిటి చేతన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సిసిఎల్ఎ నుంచి శిక్షణ పేరుతో వచ్చిన వ్యక్తని ఏవిధంగా పరిశ్రమల శాఖకు డిప్యూటేషన్‌పై పంపారన్నది నిగ్గుతేలాల్సి ఉంది. రెండేళ్ల శిక్షణ పేరుతో జిల్లాకు వచ్చి ఆరేళ్లకు పైబడి రెవెన్యూశాఖలోనే అందునా తహశీల్దార్‌గానే కొనసాగిన వ్యక్తికి సిసిఎల్ఎ డిప్యూటేషన్‌పై మిగతా 2లో ▶

ఏసీబీకి చిక్కిన మరో అవినీతి తిమింగలం

కమర్షియల్ ట్యాక్స్ అధికారి లక్ష్మీప్రసాద్ ఇంట్లో ఏసీబీ సోదాలు

ఏకకాలంలో 20 చోట్ల సోదాలు • భారీగా అక్రమాస్తులు గుర్తింపు



విశాఖలో లక్ష్మీప్రసాద్ బావమరిది ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు (వృత్తంలో)

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ :
ఏసీబీ చేతికి మరో అవినీతి తిమింగలం చిక్కింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాయన్న సమాచారంతో ఏపీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ లక్ష్మీప్రసాద్ నివాసంలో ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. ఏసీబీ డీజీపీ ఆర్.పి.ఠాకూర్ ఆదేశాల మేరకు ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో విజయవాడ కమర్షియల్ అధికారి లక్ష్మీప్రసాద్ ఆస్తులపై దాడులు జరిపారు. బుధవారం తెల్లవారు జామునుంచే ఏపీ, తెలంగాణలో మొత్తం 20 చోట్ల లక్ష్మీప్రసాద్, ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ బృందం సోదాలు జరుపుతోంది. విజయవాడలోని ఆయన నివాసంతో పాటు ఏపీ, గుంటూరు, శ్రీకాకుళం, మిగతా 2లో ▶

జగమేమాయ!



సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలేవీ అడ్డకండిరా.. లంచాలతో పోస్టులు ఎలా కొట్టాలో ఉద్యోగాలు ఎలా సంపాదించాలో అడగండి చెబుతా..!

ఇనిస్టెంట్ సాచెట్లలో.. అరకు కాఫీ

న్యూస్‌లీడర్ @ విశాఖపట్నం



కొండ కోనల నడుమ.. విష రసాయ నాలకు ఆమడ దూరంలో పండే అరుకు కాఫీ ఇప్పుడు సరికొత్త రూపంలో వినియోగదారుల ముందుకొచ్చింది. ఇంతవరకు ఫిల్టర్ కాఫీకి అనువైన రూపంలోనే లభ్యమవుతున్న అరుకు కాఫీ.. ఇప్పుడు ఇన్‌స్టంట్ రీతిలో కూడా అందుబాటులోకి వచ్చింది. గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో ముడి కాఫీ గింజలను ప్రాసెసింగ్ చేయించి అరకు వేలి ఇన్‌స్టంట్ కాఫీ పేరుతో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో మిగతా 2లో ▶

రూటు సెట్ చేసుకుంటున్న జనసేనాని

ప్రసంగాల్లో స్పష్టత ఇస్తోన్న పవన్

ప్రధానిని కలుద్దామని పదేపదే ప్రకటన

రాష్ట్రంలోని సమస్యలు మోదీ దృష్టికి అంటూ..!

ప్రత్యేక ప్రతినిధి



జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగాల్లో ప్లానింగ్‌తో వెళుతున్నట్లు తెలుస్తోంది. అభిమానులు, కేరింతలకు ప్రాధన్యం ఇవ్వకుండా చెప్పాలనుకున్నది చెబుతున్నారు. ఇటీవల ఇరు తెలుగు రాష్ట్రాల్లోనూ పవన్ కల్యాణ్ పర్యటిస్తూ మిగతా 2లో ▶

సంచలన వార్తాపత్రిక
లీడర్ క్లాసిఫైడ్స్

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు. - మేనేజ్‌మెంట్

విశాఖపట్నం | గురువారం 1-2-2018

ఫీజు కట్టలేక ప్రాణం తీసుకుంది

(మొదటి పేజీ తరువాయి)

రోజు వారి ఆదాయం నిలిచిపోయింది. ఇంతలోనే తేజశ్వినికి ప్రాక్టికల్ పరీక్షలు దగ్గరపడ్డాయి. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఆమె ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఫీజు చెల్లించలేదనే కారణంతో చైతన్య యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వలేదు. దీనిపై ఆమె తనలో తానే మదనపడింది. నిజానికి ఫీజు చెల్లించనంతలో హాల్ టికెట్ ఇవ్వననే అధికారం కాలేజికి ఉండదు. అది వేధింపుల కోణంలోకి వస్తుంది. పైగా ఫీజు వసూలు చేసుకోవడానికి ప్రధాన పరీక్షల వరకు గడువు ఉంది. కానీ డబ్బు కక్కుర్తితో చైతన్య యాజమాన్యం వేధింపులకు దిగింది. ఇకపోతే మంగళవారం హాకర్స్ అందరూ జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను వివరించగా హాకర్స్‌జోన్ ఏర్పాటు చేసే వరకు గాంధీ విగ్రహం వద్దనే వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతిచ్చారు. అంటే వ్యాపారాలు నిలిపివేసిన ఆ పది రోజుల ఖరీదు ఒక విద్యార్థిని ప్రాణం. అయితే తండ్రి జీవీఎంసీ కమిషనర్ దగ్గర ఉన్న సమయంలో తేజశ్విని తన బాధ చెప్పుకుందామని అతడికి ఫోన్ చేసింది. కానీ హడావుడిలో శ్రీనివాస్ ఆ ఫోన్‌కు స్పందించలేదు. ఆమె తల్లి ఇందుమతి కూడా అదే సమయంలో ఆస్పత్రికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని తన పిన్నికి ఫోన్ చేసి ఫీజు కట్టకపోవడం వలన తనకు హాల్ టికెట్ ఇవ్వలేదని, పరీక్షలు రాయకపోతే భవిష్యత్ పాడైపోతుందని, తాను చనిపోతున్నానని చెప్పి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న ఆ విద్యార్థిని తల్లిదండ్రుల గుండెలు బద్దలైపోయాయి. ట్రాఫిక్ పోలీసులు, చైతన్య కాలేజి యాజమాన్యం కలిసి తమ బిడ్డ ప్రాణాలు పోయేలా చేశారంటూ బోరున విలపించారు. ఇదిలావుండగా దీనిపై కేసు నమోదు చేసిన ఫోర్త్ టౌన్ పోలీసులు మాత్రం అనారోగ్య కారణంగా ఆమె చనిపోయిందని చెబుతున్నారు. వాస్తవాలు దాచడం వెనుక గల కారణం ఏమిటనేదానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తేజశ్వినీ మృతదేహానికి బుధవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

అందరిదీ అదే పరిస్థితి..

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని ఆయన ఎందుకు ముందే పరిగణనలోకి తీసుకోకుండా అర్ధ రహిత ఆదేశాలిచ్చారనేది కూడా ఆలోచించాల్సిన విషయం. శ్రీనివాస్ కుమార్తె తేజశ్విని మృతి వెనుక కమిషనర్ అనాలోచిత ఆదేశం కూడా ఒక కారణంగాచెప్పుకోవచ్చు. అలాగే ఇన్ని రోజులు చిరు వ్యాపారులు పడిన బాధకు కూడా ఆయన నిర్ణయమే కారణం.

సైకిల్‌కు రూట్ క్లియర్

(మొదటి పేజీ తరువాయి)

వాహనాలను వినియోగించక పోవడమే కదా. దాని ద్వారా ఒకరికి కాదు నగరం మొత్తానికే ఆరోగ్యం లభిస్తుంది. మోటారు వాహనాల వల్ల ప్రతిరోజు నగరంలో ఉత్పత్తి అయ్యే కాలుష్యం ఇంతా అంతా కాదు. అందుకే పర్యావరణ వేత్తలు ఈ విధంగా చెప్తున్నారు. కాలుష్యాన్ని అదుపు చేయడానికి ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండడం లేదు. అందుకే ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త కొత్త విధానాలను అమలు చేస్తూ కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. అయినా సైకిల్ సవారీ సాఫీగా సాగిపోవడానికి ఆస్కారం కూడాఉండాలి కదా. అందుకే అధికారులు అటుగా దృష్టి సారిస్తున్నారు. విశాఖలో ఇప్పటికే సైకిళ్ళను ప్రోత్సహిస్తూ సైకిల్ పార్కులను ఏర్పాటుచేశారు. ఉదయం వేళల్లో బీచ్ రోడ్లో మోటారు వాహనాలను అనుమతించక పోవడం ద్వారా సైక్లిస్టులను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో సైకిల్ ట్రాక్‌లను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో సైకిల్ పై వెళ్ళే వారికోసం రోడ్డు మీద సైకిల్ మార్గాలను ఏర్పాటు చేస్తారు. వీటిని గుర్తించేందుకు వీలుగా ప్రత్యేక రంగుతో పెయింట్ చేస్తారు. ఈ ట్రాక్ మీద సైకిల్ చోదకులు మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రోడ్ల మీద సైకిల్ తొక్కాలంటే మిగిలిన భారీ వాహనాలతో పాటే ప్రయాణించాలి. దీంతో సైక్లిస్టులకు అసౌకర్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని సైకిల్ ట్రాకులను ఏర్పాటు చేశారు. ఇతర వాహనాలు ఇక్కడికి రాకపోవడం వల్ల సైక్లిస్టులు హాయిగా ప్రయాణం చేయొచ్చు. ఇటువంటి ఏర్పాట్ల ద్వారా సైక్లిస్టులకు సౌకర్యంగా ఉంటుందని, మరింత మంది సైకిల్ ప్రయాణం పట్ల ఆసక్తి చూపుతారని చెబుతున్నారు. నగరంలోని వాల్తేరు క్లబ్ ప్రాంతంలో ఇప్పటికే సైకిల్ జోన్ కోసం ఒక రోడ్డును ప్రత్యేకంగా రంగువేసి సిద్ధం చేశారు.

దేశంలో ఇప్పటికే పూణే, లఖ్నవూ, రాయపూర్ నగరాల్లో ఇటువంటి రోడ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు విశాఖలో కూడా ఇటువంటివి ఏర్పాటు చేయడం మంచి పరిణామమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ స్ట్రీట్ ప్రోగ్రామ్ లో భాగంగా నగరంలో మరిన్ని రోడ్లపై సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేసే యోచన ఉన్నట్లు తెలుస్తోంది. నగరంలో సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడం మంచి పరిణామం. సైకిల్ తొక్కడ వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కాలుష్యం తగ్గి నగరం ఆరోగ్యం బాగుపడుతుంది.

ఇప్పటికీ నగరంలో చాలామందికి సైకిల్ తొక్కాలనే ఆసక్తి ఉన్నా, ఇతర వాహనాలకు భయపడి సైకిల్ ఉపయోగించడం మానేశారు. సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తే తప్పకుండా సైకిల్ ఉపయోగించేవారి సంఖ్య పెరుగుతుంది.

ఇనిస్టెంట్ సాచెట్లలో.. అరకుకాఫీ

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిలో భాగంగా మొదటి విడతలో నాలుగు లక్షల (2 గ్రా.) ప్యాకెట్లు, లక్ష (5 గ్రా.) ప్యాకెట్లను జీసీసీ మార్కెట్లోకి విడుదల చేసింది.రుచి పరంగా ప్రపంచ ఖ్యాతి గడించిన అరుకు కాఫీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఇన్‌స్టంట్ కాఫీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ రవి ప్రకాష్ 'లీడర్'కు తెలిపారు. మార్కెట్లో ఇప్పుడున్న దేశ, విదేశీ సంస్థల పోటీని తట్టుకోవటానికి జీసీసీ కూడా ఎన్నో కొత్త ఉత్పత్తులను తయారుచేసి మార్కెట్లో ప్రవేశ పెడుతోందని ఆయన చెప్పారు. దానిలో భాగంగానే మూడు సంవత్సరాల క్రితం అరుకు వేలి కాఫీ పొడిని మార్కెట్లోకి ప్రవేశ పెట్టామన్నారు. ఈ కాఫీ దేశ, విదేశాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిందని తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీతో సహా, పలువురు ప్రముఖుల నుంచి అరకు కాఫీకి ప్రశంసలు లభించాయన్నారు. కొద్ది రోజుల క్రితం వరకు అరకు కాఫీ వినియోగించాలంటే ఫిల్టర్ విధానం ఒక్కటే వీలు పడేదని, అయితే చాలా మంది ఇనిస్టెంట్ రీతిని కోరుకోవడంతో ఆ విధానం కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు.ఈ మేరకు ప్రైవేట్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని అరకు ఇన్‌స్టెంట్ కాఫీ పొట్లాలను మార్కెట్లోకి విడుదల చేశామన్నారు.ఈ ఇనిస్టెంట్ కాఫీ అమ్మకాలు ఏడాదికి రూ. 8 కోట్ల నుంచి రూ. 25 కోట్లకు పెరిగాయన్నారు.. రాబోయే రెండు సంవత్సరాల్లో ఈ టర్నోవర్ రూ.50 కోట్లకు చేరుకుంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

అరకు కాఫీ ప్రత్యేకత : అరకులో సాగు చేస్తున్న కాఫీ 900 నుంచి 1100 మీ. ఎంఎల్ఎల్ నేల మధ్యస్థ ఆమ్లత కారణంగా ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. నేల లక్షణాలు, బీన్స్ యొక్క ఆకృతి, పరిమాణమం వల్ల అరకు కాఫీ మంచి రుచి కలిగివుంటుంది. ఈ ప్రాంతంలో పండే అరబిక్ కాఫీ గింజలు ప్రపంచ స్థాయి నాణ్యతతో కూడినవి. అందువల్లే అరుకు కాఫీ ప్రపంచ ప్రసిద్ధి చెందింది.

కాఫీ రైతులకు లాభాలు అందించడమే ధ్యేయం..

కాఫీ పండిస్తున్న గిరిజన రైతులను దళారీల బారి నుంచి కాపాడి, వారికి అంతర్జాతీయ కాఫీ మార్కెట్ ధరలను అందించడమే లక్ష్యంగా జీసీసీ పని చేస్తోంది. కాఫీ పండించే రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు పెద్ద ఎత్తున రుణాలను అందజేస్తున్నారు. జీసీసీ చేపట్టిన చర్యల వల్ల కాఫీ రైతుల ఆదాయం రెట్టింయ్యే అవకాశం ఉంది.

రూ. 500 కోట్ల వ్యాపారమే లక్ష్యం..

గిరిజన సహకార సంస్థ (జిసిసి) యొక్క టర్నోవర్ 3 సంవత్సరాల క్రితం రు. 90 కోట్ల ఉండగా గత ఏడాది రు. 247 కోట్లకు చేరింది. ఈ యేడాది రూ. 317 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పనిచేస్తున్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో రూ. 500 కోట్ల వ్యాపారాన్ని విస్తరించడమే లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించుకున్నట్లు ఎండీ రవిప్రకాష్ చెబుతున్నారు.

జీఎస్‌టీ శకంలో తొలి బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

చేరబోతున్నారు! స్వతంత్ర భారత చరిత్రలో ఇంతవరకు వెలుగుచూసిన 88 బడ్జెట్లు ఒకెత్తు. వచ్చే బడ్జెట్ మరొకెత్తు. ఎందుకంటే, దేశంలో అతిపెద్ద పన్నుల సంస్కరణగా జీఎస్‌టీ (వస్తుసేవల సుంకం) పట్టాలకు ఎక్కిన దరిమిలా మొట్టమొదటి బడ్జెట్ కూర్పు ఇదే. జీఎస్‌టీ రాక బడ్జెట్ మౌలిక స్వరూప స్వభావాలను ఎంతగా ప్రభావితం చేసిందో రేపటి జైట్లీ ప్రసంగం స్పష్టీకరించనుంది. సాధారణంగా, కేంద్ర బడ్జెట్‌లో రెండు భాగాలుంటాయి. రంగాలవారీగా వివిధ పథకాలకు కేటాయింపుల వివరాలను పొందుపరచేది మొదటిది. ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన మార్పులూ చేర్పుల సమన్వితం రెండోది. వ్యాట్ (విలువ ఆధారిత పన్ను), ఎక్సైజ్ సుంకం సహా డజనుకుపైగా వేర్వేరు పరోక్ష పన్నులను జీఎస్‌టీ ఖర్చు రాసేసింది. వస్తు సేవలపై ఏమైనా నిర్ణయాలు తీసుకునే బాధ్యత, రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్‌టీ మండలికి దఖలుపడింది. పర్యవసానంగా పరోక్ష పన్నుల్లో ప్రధాన పద్దులుగా దశాబ్దాల తరబడి చలామణీ అయిన కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, సేవాసుంకాలతోపాటు తక్కినవాటిపై ప్రతిపాదనల ఊసే లేకుండా నూతన బడ్జెట్ రూపుదాల్చనుంది. ఆ మేరకు బడ్జెట్ ప్రసంగ నిడివి కుదించుకుపోవడం తథ్యం. కొన్నేళ్లుగా విద్య, కృషి కల్యాణ్, స్వచ్ఛభారత్, శుద్ధ ఇంధనం తదితరాల పేరిట రకరకాల సెస్సుల వడ్డన 'బడ్జెట్ సంప్రదాయం'గా స్థిరపడింది. అటువంటి ఇరవైరకాల సెస్సులూ జీఎస్‌టీ పద్దులో అంతర్భాగమైన కారణంగా, బడ్జెట్ ప్రసంగ సరళిలో గుణాత్మక పరివర్తన ప్రస్ఫుటం కానుంది.


ఏసీబీకి చిక్కిన మరో అవినీతి తిమింగలం

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ, హైదరాబాద్‌లలో అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు జరిపిన తనిఖీల్లో సుమారు రూ.3 కోట్ల వరకు అక్రమాస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాడుల్లో భాగంగా నగరంలోని చినవాల్తేర్‌లో గల లక్ష్మీప్రసాద్ బావ ఇంటితో పాటు, మరో రెండు చోట్ల అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో కొన్ని పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని లెజెండ్ అపార్ట్‌మెంట్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఒక్క హైదరాబాద్‌లోనే మొత్తం 8చోట్ల దాడులు జరిగాయి. విజయవాడలోని ఆయన నివాసంలో జరిపిన తనిఖీల్లో పెద్దఎత్తున బంగారు ఆభరణాలు, వెండి సామాను లభ్యమైంది. 30 తులాల బరువు గల బంగారు ఆభరణాలు, కిలో బంగారానికి సంబంధించిన రసీదులు ఉన్నట్లు బయట పడ్డాయి. రెండు కార్లతో పాటు, గచ్చిబౌలిలో 2వేల చదరపు అడుగులో ఓ కమర్షియల్ భవనం, పరిగిలో నాలుగు ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో లక్ష్మీప్రసాద్ రూ.3 కోట్ల విలువైన ఆస్తులు కలిగి ఉన్నట్లు అధికారులు తేల్చారు. అటు శ్రీకాకుళంలోని లక్ష్మీప్రసాద్ సోదరుడి నివాసంతో పాటు నర్సన్నపేటలోని బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదారుల కొనసాగుతున్నాయి. విలువైన నగలు, పలు ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో కలకలం... వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి లక్ష్మీప్రసాద్ ఏసీబీకి చిక్కడంతో ఆ శాఖలో కలకలం రేగుతోంది. ఈ నెల 12వ తేదీన రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయంలోనే అడిషనల్ కమిషనర్ ఉప్పు ఏడుకొండలుతో పాటు అతడికి సహకరించిన సూపరింటెండెంట్, లంచం అందజేస్తున్న ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన ఇద్దరు వ్యక్తులను అవినీతి నిరోధక శాఖ వలపన్ని పట్టుకున్న సంగతి తెలిసిందే. వారి నుంచి రూ.23.20లక్షల నగదును స్వాధీనం చేసుకుంది.

ఉత్తర భారతాన్ని వణికించిన భూకంపం



(మొదటి పేజీ తరువాయి)

ఇళ్ళు, కార్యాలయాల్లోకి తిరిగి వెళ్ళేందుకు భయపడ్డారు. ఈ భూకంప తీవ్రత భూకంప లేఖినిపై 6.2గా నమోదైంది. భూకంప కేంద్రం ఆఫ్ఘనిస్థాన్ - తజికిస్థాన్ మధ్య హిందుకుష్ పర్వత శ్రేణుల్లో ఉన్నట్లు చెప్తున్నారు. గత సంవత్సరం హిమాచల్ ప్రదేశ్‌లో దాదాపు 12సార్లు భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే.

అర్హత లేకున్నా ఐలా కమిషనర్‌గా..

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల శాఖకు పంపడం వెనుక రాజకీయ హస్తమున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. తనకు నచ్చిన జిరాయితీ భూములను సయితం 22(1)ఎలో పెట్టడం, తనకు నచ్చని ప్రభుత్వ యుఎల్‌సి, అగ్రకల్చర్ సీలింగ్, ఇనాం భూములను నిషేధిత ఆస్తుల జాబితానుంచి తొలగించడంలో వేణుగోపాల్ సిద్ధహస్తుడుగా రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి. రికార్డుల తారుమారకు సంబంధించి సిట్‌లో ఫిర్యాదు సయితం ఆయనపై ఉంది. తహాశీల్దార్‌పై వెల్లువెత్తిన అవకతవకలపై లీడర్‌లో వచ్చిన వరుస కథనాలకు కలెక్టర్ ఎట్టకేలకు స్పందించి గాజువాక తహాశీల్దార్‌గా అదనపు బాధ్యతలనుంచి తొలగించారు. అయితే నిన్నమొన్నటి వరకూ జోడు పదవులపై సాగిన వేణుగోపాల్ ఇప్పుడు ఐలా కమిషనర్‌గా తన శైలికి పదును పెడ్తున్నారు. ఎపిఐఐసి ఇండ్రస్ట్రియల్ పార్కుల్లో పరిశ్రమలకు వేగవంతంగా అనుమతులివ్వడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐలా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం ఐలా స్వయంగా తమ అవసరాలకు అనుగుణంగా పరిపాలన సాగించుకొనే స్వేచ్ఛ దొరుకుతుంది. ఐడిఎల్లో పరిశ్రమలు స్థాపించేందుకు అవసరమైన అనుమతులు కావాలంటే గతంలో స్థానిక అర్బన్‌లోకల్‌బాడీ, వుడా అనుమతులు తప్పనిసరిగా ఉండేవి. ఐలా చట్టం రావడంతో ఈ వ్యవహారం సులభతరమైంది. నిజానికి ఐలా కమిషనర్ నగర పంచాయతీ, చిన్న మున్సిపాలటీ కమిషనర్‌లతో సమానమన్నమాట. ఐలా కమిషనర్‌గా కొనసాగాలంటూ కనీసం స్థానిక పరిపాలన, ఇంజినీరింగ్ పరిజ్ఞానం అవసరం.

కాని దీర్ఘకాలంగా సిసిఎల్‌ఎలో కొనసాగి శిక్షణ పేరుతో మాత్రమే తహాశీల్దార్‌గా విధులు వెలగబెట్టిన తహాశీల్దార్ వేణుగోపాల్‌కు ఐలా కమిషనర్ పదవిని డిప్యూటేషన్‌పై కట్టబెట్టడం పలు విమర్శలకు తావిస్తుంది. ఐలా పరిధిలో ఎపిఐఐసి భూములు, స్టీలుప్లాంట్ చిన్నతరహా పరిశ్రమలు ప్రోత్సాహం కోసం అలైన్ చేసిన భూములు ఎపిఐఐసి వద్దనే ఉన్నాయి. అలాగే ఐలా పరిధిలో అనేక మిగులు భూములు ఆక్రమణలకు గురై ఉన్నాయి. వీటిపై రాజకీయ నాయకుల కన్నుపడటంతో ఇక్కడ ఐలా కమిషనర్ పదవి సయితం తనకు అనుకూలమైన వారికి కేటాయించాలన్న ఒత్తిడి రాజకీయ వర్గాలు తెస్తున్నాయి. దీని పర్యవసానమే వేణుగోపాల్ ఐలా కమిషనర్‌గా డిప్యూటేషన్‌పై రావడానికి దోహద పడిందంటున్నారు. ఐలా కమిషనర్‌గా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లు కేటాయింపు, ఐలా భూముల క్రమబద్ధీకరణ వంటివి కమిషనర్ జోక్యంతో సాగేవేనన్నది సత్యదూరం కాబోదు. అసలే అవినీతి ఆరోపణలతో పీకలలోతు కూరుకు పోయిన వేణుగోపాల్‌ను ఆ పదవిలో కొనసాగించడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూటు సెట్ చేసుకుంటున్న జనసేనాని

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాసమస్యలపై స్పందిస్తున్నారు. ఈ క్రమంలోనే సమస్యల పరిష్కారానికి ప్రధాని మోదీని కలుద్దామని అంటున్నారు. ప్రధాని దృష్టికి తీసుకువెళ్లేందుకు తాను వస్తానని చెబుతున్నారు. ఏపీకి హెూదా ఇవ్వకుండా అన్యాయం చేసిందని బీజేపీపై తీవ్రస్థాయి లో పవన్ విమర్శలు చేశారు. అసంబద్ధంగా విడదీసిన కాంగ్రెస్ కంటే బీజేపీ కూడా ఏమీ తక్కువకాదంటూ మండిపడ్డారు. అప్పటి నుంచి బీజేపీగానీ మోదీ ప్రస్తావన, ఊసు లేకుండానే ఉన్నారు. కానీ ఇటీవల పూర్తిస్థాయిలో ప్రజల్లో ఉంటున్న నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రస్తావన తానే తీసుకువస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న సమస్యల పరిష్కారానికి మోదీ దగ్గరకు వెళదామంటూ సూచిస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలో జరిగిన రెండు సమావేశాల్లోనూ ఇదే అంశాన్ని పవన్ పదేపదే చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఉన్న టీడీపీ, ఎన్‌డీఏలకు 2014 ఎన్నికలలో మద్దతుగా నిలిచిన పవన్ రానున్న ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారు. ఈ క్రమంలోనే రెండు రాష్ట్రాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తూ ప్రజా సమస్యలపై స్పందిస్తున్నారు. పరిష్కారానికి తగిన సలహాలు, సూచనలు ప్రభుత్వానికి అందిస్తూ అండగా ఉంటానని చెప్పారు. ఈ క్రమంలో ధర్మవరం చేనేతలతో ఆయన మాట్లాడుతూ మంచి వస్త్రాన్ని నేసి తీసుకురండీ మోదీని చూపిద్దామని పవన్ అన్నారు. దీనిని బట్టి చూస్తే మోదీని కలిసేందుకు పవన్ సిద్ధమయ్యారు. అంతేకాదు ప్రజలపక్షాన ఉన్నానన్న విషయాన్ని తెలియజేసేందుకు జనసేన యత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

2,3 తేదీలలో క్రీడాకారుల ఎంపిక

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: క్రీడల పట్ల ఆసక్తి వున్న బాలబాలికలకు 2018, 19 ఏడాదికిగానూ స్పోర్ట్స్ అకాడమీ శిక్షణకు కోసం ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాలియోట్ పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఎంపికలు ఫిబ్రవరి రెండు, మూడు తేదీల్లో విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆర్చరీ, రైఫిల్‌షూటింగ్, సైక్లింగ్, బాక్సింగ్ తదితర విభాగాల్లో ఎంపిక చేస్తామన్నారు

గ్రహణం ప్రభావం..ఆలయాలు మూసివేత

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా నగరంలోని ఆలయాలు మూసివేశారు. గ్రహణం ప్రభావం కారణంగా ఉదయం 9.30 నుంచే పలు ఆలయాలు మూసివేసి దర్శనాలు నిలిపివేశారు.

ఉదయం 8 గంటల నుంచే కనకమహాలక్ష్మి ఆలయం మూసివేత..

గ్రహణ ప్రభావం కారణంగా నగరంలోని బురుజుపేటలో వున్న కనకమహాలక్ష్మి ఆలయాన్ని ఉదయం 8 గంటల నుంచే మూసి వేశారు. ఉదయం అమ్మవారికి నివేదన సమర్పించిన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. గురువారం ఉదయం అమ్మవారికి సంప్రోక్షణ నిర్వహించి, పంచామృతాభిషేకం గావించి ఆరు గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని ఆలయ ఈఓ ఎస్.జ్యోతిమాధవి తెలిపారు. చంద్రగ్రహణం ప్రభావం కారణంగా నగరంలోని ఆశీల్‌మెట్ట వద్ద గల సంపత్ వినాయక దేవాలయాన్ని మూసివేశారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం 9.30 గంటలకు ఆలయాన్ని అర్చకులు మూసివేశారు. రాత్రి సంప్రోక్షణ చేసిన అనంతరం గురువారం ఉదయం నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. దీంతో పాటుగా నగరంలోని పెదవాల్తేర్‌లో గల కరకచెట్టు పోలమాంబ దేవాలయం, అల్లిపురంలో గల నీలమ్మవేప చెట్టు దేవస్థానం, అప్పాంగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయాలతో పాటు, నగరంలోని పలు ఆలయాలను ఉదయం 9.30 గంటల నుంచి మూసివేశారు. గ్రహణం అనంతరం సంప్రోక్షణ చేసి తిరిగి ఆలయాల్లో భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

మాఘ పౌర్ణమి ప్రత్యేక పూజలు..


మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం నగరంలోని ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునుంచే భక్తులు బారులు తీరారు. మాఘ పౌర్ణమి పురస్కరించుకొని సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో సముద్ర తీరాలు సందడిగా మారాయి.



మూసివేసిన కనకమహాలక్ష్మి ఆలయం



భక్తులతో బారులు తీరిన ఇసుక కొండ



నీలమ్మ వేపచెట్టు గుడి



పెదవాల్తేరు పోలమాంబ గుడి

ముగ్గురు దొంగలు అరెస్ట్



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: నగరంలోని వివిధ ప్రాంతాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ద్వారకానగర్ పోలీస్ స్టేషన్ సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తున్న కాగితాల జ్యోతిరెడ్డి (19), గుర్రపు శివ(18), కేత వరహాలబాబు (27)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.9 లక్షల 77 వేల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదును, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు నగరంలోని కైలాసగిరి, ఎంవీపీ కాలనీ, వాల్తేర్ క్లబ్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఇళ్లలో చోరీలు చేసేవారని, అదేవిధంగా బైక్ దొంగతనాలకు పాల్పడేవారని చెప్పారు. వీరిని ఈ నెల 30వ తేదీన ఉషోదయ కూడలి వద్ద అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి 26 తులాల బంగారం, వెండి ఆభరణాలు, డైమండ్ నెక్లెస్, రూ. 95 వేల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ కృష్ణారావు, ఎస్ఐలు గోవిందరావు, లక్ష్మణరావు, ధర్మేంద్ర పాల్గొన్నారు.

బీవీకేలో త్యాగరాజ ఆరాధనోత్సవం



డాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం ద్వారకానగర్ బీవీకే కళాశాలల్లో ఘనంగా జరిగాయి. ప్రతి ఏడాదితో పాటుగా నెలకొకసారి స్వామివారిని స్మరిస్తూ వివిధ సంగీత కార్యక్రమాలు జరుగుతన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ నిష్టల కృష్ణవేణి తెలియజేశారు. ఆరాధనోత్సవంలో భాగంగా బుధవారం త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రముఖ సంగీత కళాకారుల వాయిద్యాలతో సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వివిధ సంగీత వాయిద్యాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ముఖ్య అతిథి బీవీకే కళాశాల చైర్మన్ ఎ. నారాయణ స్వామి చేతులు మీదుగా అందజేయనున్నామన్నారు. తొలిత ఉదయం త్యాగరాజ స్వామికి పంచరత్న సేవ నిర్వహించామన్నారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వోకల్ ఆర్టిస్ట్ మోదిమాడి సుధాకర్, మాట్నూరి జలజాక్షి, పంతులు రమా, పాల్గొన్నారు.

టీఎల్‌ఎఫ్ ఎలక్షన్ ఆపేయాలంటూ మహిళల ఆందోళన



ఎన్‌పీడి, న్యూస్ లీడర్: స్వయం సహాయక సంఘ అధ్యక్ష పదవి ఎంపిక వాయిదా వేయాలని మహిళలు బుధవారం ఆందోళన చేపట్టారు . ఈ మేరకు 41 వార్డు తమ్మద పాలేం సామాజిక భవనంలో జరిగిన ఈ ఎలక్షన్ ఎంపిక లో సక్రమముగా జరగలేదని అధికార పార్టీ వర్గాలు కనుసైగల్లో ఎంపిక జరిగిందని ఆవేదన వ్యక్తం చేసారు .టి ఎల్ యఫ్ ఎలక్షన్ కోసం సభ్యులైన టి వంటి అధ్యక్షులు ఎస్ ఎల్ ఎఫ్ ఉండాలని ఈ సందర్భంగా మహిళలు తెలిపారు . ఇటీవల 42 వార్డు లో ఉన్న కోశాధికారి సభ్యురాలని కృష్ణవేని మహిళను రాత్రి రాత్రే సభ్యులతో కలిసి సభ్యులుగల స్వచ్ఛత సమన్య నిర్వహించి చట్టవరమైన సమయంలో అధ్యక్షులుగా చేయడం దారుణమన్నారు .నామినేషన్ ఈ రోజుని నిర్ణయించి ఈ రోజు ఎలక్షన్ పెట్టి అత్యవసరంగా అధ్యక్షురాలిని ప్రకటించడం దారుణమని ఈ సందర్భంగా పేర్కొన్నారు .ఈ ఎలక్షన్ ఏ రాజకీయ పార్టీకి ఎటువంటి సంబంధం లేకుండా రాజకీయాల అతీతంగా జరగాలని పేర్కొన్నారు ఇందులో సభ్యులు జేబీఎస్ కమిటీ ద్వారా ఎన్నుకోవడం కావాలని ఈ సేవా మహిళలు పేర్కొన్నారు .తదానంతరం ఎలక్షన్ ఆపాలని సిడివో రాజశేఖర్ ,ఏపీడివో చిట్టిబాబుకు వినతిపత్రం అందజేశారు .

గంగపుత్రులను గుర్తిస్తేనే గెలిపిస్తాం

మత్స్యకార ఎస్టీ సాధన సమితి నాయకులు



దీక్షలో పాల్గొన్న మత్స్యకారులు

డాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: మత్స్యకారుల సమస్యల పట్ల స్పందించే నాయకులను మాత్రమే వచ్చే ఎన్నికల్లో గెలుపించుకుంటామని మత్స్యకార నాయకులు, మాజీ కార్పొరేటర్ బుద్దా నీలకంఠం తెలియజేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం దరి చేపడుతున్న మత్స్యకార ఎస్టీ సాధన సమితి రిలే నిరహార దీక్షలు బుధవారం 36వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు నీలకంఠం మాట్లాడుతూ మత్స్యకారులు ఆవేదనను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌కు విన్నవించుకున్నామని, ఆయన స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పడం జరిగిందన్నారు.ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం తమకుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 9జిల్లాల తీరప్రాంతాల్లో వున్న సుమారు 40లక్షల జనాభా మత్స్యకార ఓట్లుతో గెలచి తమపై చిన్నచూపు చూడటం తగదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 36రోజులు గడుస్తున్న ప్రభుత్వానికి కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మూగి సూర్యనారాయణ, మూగి రాముడు, చొక్కా అప్పారావు, మైలిపిల్లి పైదయ్య, దౌలపిల్లి రాజు, కంబాల షణ్ముకరావు, బి.అప్పన్న, చెన్నాదాస్ తది తరులు పాల్గొన్నారు.

ఆ విగ్రహం ఎవరిది..



విశాఖపట్నం ,న్యూస్‌లీడర్: జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులో చెట్టు కింద ఉన్న ఒక విగ్రహం ప్రస్తుతం చర్చకు తెరతీసింది. నగరంలో విగ్రహాల ఏర్పాటుపై ప్రభుత్వ ఆంక్షలు ఉన్నాయి. ముఖ్య కూడళ్లు, బీచ్‌రోడ్డులో ప్రముఖుల విగ్రహాలు ఇబ్బడిముబ్బడిగా నెలకొనడంతో గతంలో వివాదాలకు దారి తీసింది. ఇప్పటికీ అనేక ప్రధాన కూడళ్లు, సాగరతీరంలో పదుల సంఖ్యలో విగ్రహాలు దర్శనమిస్తాయి. అయితే అవన్నీ గతంలో ఏర్పడినవి. కానీ కొత్తగా విగ్రహం ఏర్పాటు చేయాలంటే దానికి మాత్రం ఇక్కడి అధికారులు అనుమతులు ఇచ్చే పరిస్థితి లేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే నేరుగా ఆదేశాలివ్వాల్సి ఉంటుంది. అయితే అంత దూరం వెళ్లి అనుమతులు తెచ్చుకునే ఓపిక లేని వారు, అనుమతులు రావేమోనని భయపడేవారు చాలా మంది ఉన్నారు. అలాగని విగ్రహ స్థాపన విషయంలో వాళ్ల ఆలోచనలు మాత్రం వెనక్కి తగ్గవు. అందుకే అనుమతులతో పని లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకునే ప్రయత్నాలు అప్పుడప్పుడు జరుగుతుంటాయి. ఇదే క్రమంలో ఈ పార్కులో కి కూడా ఒక కొత్త విగ్రహం తెచ్చి పెట్టారనే అనుమానాలు వినిపిస్తున్నాయి. ఎవరూ లేని సమయంలో విగ్రహాన్ని నెలకొల్పితే తర్వాత ప్రముఖుడిది కాబట్టి ఎవరూ ముట్టుకోరనే ఆశాభావంతోనే అక్కడ పెట్టి ఉంటారనిపిస్తోంది. అయితే విగ్రహానికి గోనెసంచులు చుట్టి ఉన్న నేపథ్యంలో అది ఎవరి ప్రతిమ అనేది తెలియడం లేదు.అయితే అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి కొత్త విగ్రహాల ఏర్పాటు నిబంధనలకు విరుద్ధంగా జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



విశాఖ ఉక్కు నిర్వాసితులకు ఆఫ్ లైన్ విధానం ద్వారా జెటి పరీక్ష నిర్వహించాలని ఉక్కు నిర్వాసిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉక్కు పార్కులో నిర్వాసితులు ధర్నా నిర్వహించారు. ఉక్కు నిర్మాణ కోసం విలువైన భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఆఫ్ లైన్ విధానంలో పరీక్ష నిర్వహించాలని తాము కోర్టుకు వెళ్ళడం జరిగిందని తెలిపారు కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కారణంగా జెటి ఆన్ లైన్ రద్దు కాబడిందని ఐక్య వేదిక అధ్యక్షులు ఒమ్మిడి అప్పారావు తెలిపారు

విమ్స్ ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం



ఆరిలోవ, న్యూస్‌లీడర్ : విమ్స్ ఆస్పత్రిని ప్రైవేట్ పరం చేయాలన్న చర్యలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తు సీపీఎం నగర శాఖ బుధవారం ఆస్పత్రి ఆవరణలో ధర్న నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెనుకబడి వున్న ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య సంబంధించి నామమాత్ర రుసుముతో వైద్యం అందిస్తున్న విమ్స్ ప్రైవేటుపరం చేస్తే పేదలకు వైద్యం దూరమవుతుందన్నారు. తక్షణమే ఈ ఆలోచనకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలని లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ సత్యవరప్రసాద్‌కు వినతిపత్రం అందజేసారు.

పిగ్ షూటర్స్ లంచాల నుంచి రక్షించండి

పందుల పెంపకం దారులు



ధర్నా చేస్తున్న పందుల పెంపకం దారులు

డాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: పందుల పెంపకం దారులను బెదిరించి వసూళ్ళకు పాల్పడుతున్న జీవీఎంసీ పిగ్ షూటర్ నాయుడుచ డ్రైవర్ సాయి, ఇన్స్‌పెక్టర్ వాసులపై చర్యలు తీసుకోవాలని ప్రజా నాయకులు, న్యాయవాధి పీవీ గిరిధర్ డిమాండ్ చేశారు. పెందుర్తి పందుల పెంపకం దారులుతో హంటర్ విజన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం దరి బుధవారం నిరసన చేపట్టారు. ఈ మేరకు పీవి గిరధర్ మీడియాతో మాట్లాడుతూ పందులున్న ప్రతి ఒక్కరి నుండి వారానికి 4వేలు, నెలకు 10వేల రూపాయాలను లంచాలు ఇవ్వాలని తరుచూ వేదిస్తూ బెదిరింపులు చేసి వసూళ్ళు చేస్తున్నారని ఆరోపించారు. పిగ్ షూటర్ బృందం ముగ్గురు కలిసి పేదలైన వీరిని అతి దారుణంగా హింసించి లంచాలు తీసుకోవంద దారుణమన్నారు. సదరు డ్రైవర్ సాయి పది లక్షలు ఒకేసారి చెల్లిస్తే వదిలేస్తామని, లేదంటే పందులు ఒక్కటి కూడా దొరకుండా చేస్తామని హెచ్చరించాడని చెప్పారు. అలాగే ఈ ప్రాంతంలో పందుల పెంపకందారుల పెళ్ళులు, శుభకార్యాలు ఏవి జరిగిన ప్రత్యేకంగా ముగ్గురికి లాంచనాలు ఇస్తేనే బందువులను వెళ్ళనిచ్చే దుర్భరపరిస్థితి చోటుచేసుకున్నాయని మండిపడ్డారు. వారు ముగ్గరు శాషించిన విధంగా జరగని పక్షంలో లంచం సమయానికి అందించని వారిపై కక్ష గట్టి ఫిర్యాదు సృష్టించి వారి పందులు ఎక్కడ వున్న కాల్చి చంపుతాడని అన్నారు. ఇంత క్రూరంగా ప్రవర్తిస్తున్న వీరిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పందులను ప్రభుత్వం అరికట్టాలంటే తమకి ఉద్యోగాలు కల్పించాలని, లేదా పందుల పెంపకానికి లైసెన్స్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పం దుల పెంపకం దారులు వాడపల్లి రాము, దసర, పెంద్రిరమణ, పెంద్రి చిన బాబు, దంబారి రామారావు, వాడపల్లి రాము, ఆసనాల అప్పన్న పాల్గొన్నారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించండి

బైబుల్‌ను కాల్చి వేసిన మతోన్మాదులను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

డాబాగార్డెన్స్ న్యూస్‌లీడర్: క్రైస్తవుల హక్కులను కాలరాస్తూ దాడిచేస్తున్న మతోన్మాదులుపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటగ్రేటెడ్ క్రిష్టియన్ కౌన్సిల్ (ఎఐసీసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 23వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోదం గ్రామంలో క్రైస్తవుల చేతినుండి ప్రవిత్ర గంధ్రమైన బైబిల్‌ను బలవంతంగా లాక్కొని తగలపెట్టడం జరిగిందన్నారు. ఈ సంఘటనను నిరసిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం నుండి సరస్వతి పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు వారు మీడియాతో మాట్లాడుతూ క్రైస్తవుల పట్ల జరుగుతున్న దాడులు, అన్యాయాలు పై ప్రభుత్వం స్పందించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, సీపీ లకు వినతి అందించడం జరిగిందన్నారు. క్రైస్తవ మనోభావాలు దెబ్బతీసే ఇటువంటి చర్యలు పునారవృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. చైతన్య, జిల్లా అధ్యక్షుడు డి. అబ్రహాం, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర్యకాంతం, జిల్లా ఉపాధ్యక్షుడు టి. దానియల్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


2 నుంచి సత్యనారాయణ ఫుట్‌బాల్ టోర్నమెంట్



సమావేశంలో మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

డాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: బి.సత్యనారాయణ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డాల్ఫిన్ ఫుట్‌బాల్ క్లబ్ అధ్యక్షులు మారుతి శ్రీధర్ తెలిపారు. బుధవారం ఉదయం డాబాగార్డెన్స్ వి.జె.ఎఫ్. క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ ఈ టోర్నమెంటులో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 19 జట్లు పాల్గొంటాయన్నారు. మూడురోజుల పాటు అత్యంత ఉత్సాహ భరిత వాతావరణంలో సాగే ఈ టోర్నమెంటు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహిస్తున్నామన్నారు. ఇది ఆహ్వాన టోర్నమెంటుగా ఆయన తెలిపారు. టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సత్యనారాయణ మెమోరియల్ టోర్నీ విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 19 జట్లు పోటీ పోటీగా తలపడనున్న ఈ మ్యాచ్‌లను వీక్షించే అవకాశం అందరికీ కల్పిస్తున్నామన్నారు. టోర్నీ చీఫ్ ఆర్గనైజర్, వి.జె.ఎఫ్. కార్యదర్శి ఎస్. దుర్గారావు మాట్లాడుతూ సత్యనారాయణ మృతిచెందిన విషయం చాలా మందికి తెలియలేదని, అయితే ఆయన స్నేహితులు, ఇతర మిత్రులు కలిసి ఈ టోర్నీ ఏర్పాటు చేస్తున్నామని, ఇదే సమయంలో వారి కుటుంబానికి సాయం అందించాలని కోరుకు న్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రతిఏటా ఈ టోర్నీ నిర్వహణకు కృషిచేస్తామన్నారు. ఈ సమావేశంలో డాల్ఫిన్ ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి డి. రవికాంత్, ఆర్గనైజర్ ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా, టోర్నీ సహాయ ఆర్గనైజర్ టి. నానాజీ సత్యనా రాయణ సేవలను గుర్తుచేస్తూ వందన సమర్పణ కార్యక్రమం నిర్వహించారు.

4న పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డు రిజిస్ట్రార్ ఆఫీసర్ ఎదురుగా ఓ ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సమ్మేళనం కన్వీనర్ పంపాన వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సెయింట్ ఆంథోని హైస్కూల్ 1985 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా కలిసి గురువందనం పేరిట ఆనాటి ఉపాధ్యాయులందరిని ఘనంగా సత్కరిస్తామన్నారు. అనంతరం ప్రస్తుతం సెయింట్ ఆంథోని హైస్కూల్‌లో చదువుతున్న ఉత్తమ విద్యార్థులను అభినందించి వారికి నగదు పురస్కారాలను ఇవ్వనున్నామని, కనుక 1985 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా పాల్గొని పై కార్యక్రమాన్ని జయప్రదం చేయమని కోరారు. మరిన్ని వివరాలకు ఆరిశెట్టిదినకర్ డా।। జి.వి.శ్రీధర్, పంపాన వెంకటేశ్వరరావు సెల్ : 9848885186, 9652782118, 984863 4292 సంప్రదించవచ్చునన్నారు. ఈ సమావేశంలో ఆరిశెట్టి దినకర్, డా।। జి.వి. శ్రీధర్, నడింపల్లి రామకృష్ణరాజు, కొణతాల ప్రసాద్, పీతల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వం సరికాదు

ఏక కాల ఎన్నికల నినాదం వెనుక ప్రభంజన సిద్ధాంతం ఇమిడి ఉన్నదని చెప్పకతప్పదు. ఏదేమైనా విభిన్న జాతులు, సంస్కృతులు కలిగిన విశాల దేశంలో ఒకేసారి ఎన్నికల నిర్వహణ అనేది ప్రాంతీయ ఆకాంక్ష లను మరుగుపరుస్తుంది. నిర్దిష్ట కాలపరిమితి లోపల ఎన్నికలు జరువ కూడదంటే ఎన్నికైన వారు నిరంకుశ పోకడలు పోయే ప్రమాదం ఉన్న ది. ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభంగా పరిగణించే ఎన్నికల ప్రక్రియను, కాలాపహరణంగా చూడటం, డబ్బు ఖర్చు కిందికి కుదించటం ప్రజా స్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బడ్జెట్ సమావేశాలకు ముందు పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ జమిలి ఎన్నికలతోనే ప్రయోజనమని ప్రకటించటం చర్చనీయాంశమైం ది. లోక్‌సభ, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ఖర్చు ఆదా, సమయం కలిసివస్తుందని, దేశమంతా దీనిపై విస్తృతంగా చర్చించాలని రాష్ట్రపతి సూచించారు. కొంతకాలంగా ప్రధాని మోదీ కూడా జమిలి ఎన్నికల గురించి చెపుకొస్తున్నారు. రాష్ట్రపతి ప్రసంగం కేంద్ర ప్రభుత్వ విధానాన్ని వెల్లడిస్తుంది. కనుక, జమిలి ఎన్నికలపై ప్రభుత్వం ఎంత పట్టుదలగా ఉన్నదో తెలుస్తున్నది. 2010లోనే బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ చట్టసభలకు నిర్దిష్ట కాలపరిమితి ఉండాలనీ, వాటన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. దీన్నే 2014లో బీజేపీ ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచారు. ఇప్పుడు నరేంద్రమోదీ అవకాశం ఉన్నప్పుడల్లా ఒకే భారత్- ఒకేసారి ఎన్నికలు (వన్ ఇండియా- వన్ ఎలక్షన్) నినాదంగా బలంగా ముందుకుతెస్తున్నారు. అయితే దీన్ని బీజేపీ, దాని ప్రధాన మిత్రపక్షాలు మినహా వివి ధ రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జమిలి ఎన్నిక ల నినాదం సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధమని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాయి. కాంగ్రెస్ రాజ్య సభసభ్యుడు సుదర్శన్ నాచియప్పన్ నాయకత్వంలోని పార్లమెంటు స్థాయి సంఘం దీనిపై అధ్యయనం జరిపి ఒకే దఫా ఎన్నికలను సమర్థించటం గమనార్హం. జమిలి ఎన్నికలు ఉంటేనే మంచిదనే వారు దీనివల్ల ఎంతో సమయం, ధనం ఆదా అవుతాయని అంటున్నారు. 1971 నుంచి ఎన్నికల కమిషన్ దాదాపు ఏటా దేశంలో ఏదో ఒక మూల ఎన్నికలు నిర్వహిస్తూనే ఉన్నది. సాధారణంగా లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ రెండున్నర నెలల పాటు సాగుతుంది. ఎన్నికలకు ముందే ఎన్నికల సంఘ ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుంది. దీంతో ఆ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టడానికి వీలుండదు. కొత్త ప్రాజెక్టులు ప్రకటించకూడదు. ఎన్నికల సంఘం అనుమతి లేనిదే ఉద్యోగులను కూడా బదిలీ చేయ కూడదు. ప్రభుత్వ అధికారులు, నేతలు ఎన్నికల పనుల్లో నిమగ్నమవు తారు. ఒక్క మాటలో చెప్పాలంటే సమస్త యంత్రాంగం స్తంభించిపోతుం ది. కాబట్టి జమిలి ఎన్నికలే దేశాభివృద్ధికి అనువుగా ఉంటాయని వాదిస్తున్నారు. కానీ జమిలి ఎన్నికల ను వ్యతిరేకించే వారి వాదన కూడా బలంగానే ఉన్నది. జమిలి ఎన్నికలు దేశ సమైక్యతకు పట్టుకొమ్మగా ఉన్న సమాఖ్యస్ఫూర్తికి గొడ్డలిపెట్టని అంటున్నారు. మరీ ముఖ్యంగా నిర్దిష్ట కాలపరిమితి అనే పదాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా యి. రాజ్యాంగం ప్రకారం చట్టసభల పదవీకాలం ఐదేండ్లే అయినా గడువుకన్నా ముందే మధ్యంతర ఎన్నికలు జరుపటానికి రెండు సభలకూ చట్టబద్ధమైన హక్కు ఉన్నది. ఈ వెసులుబాటును హరిం చి నిర్దిష్ట తేదీల్లోనే ఎన్నికలు జరుపాలనడం రాజ్యాంగాన్ని వక్రీకరించడమే. కేంద్రంలో లేదా ఏదైనా రాష్ట్రంలో పాలక పార్టీ మెజారిటీ కోల్పోతే, కొత్త పద్ధతి ప్రకారం మధ్యంతర ఎన్నికలు జరుపటానికి వీలుండదు. గడువుకాలం దాకా అక్కడ రాష్ట్రపతి పాలన విధించాల్సి వస్తుంది. ఇది పూర్తిగా అప్రజాస్వామికం. జమిలి ఎన్నికల వాదాన్ని కొన్ని రాజకీయపార్టీలతో పాటు, రాజ్యాంగ నిపుణులు కూడా తీవ్రంగా వ్యతిరేకించటం పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశమే. స్వతంత్ర భారతంలో 1952 నుంచి 67 దాకా నాలుగుసార్లు లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకే సారి ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. 1968, 69లలో కొన్ని రాష్ట్రాలను గడువుకన్నా ముందే రద్దుచేయటం, 1971లో పార్లమెంటుకు మధ్యంతర ఎన్నికలు జరుగటంతో దేశంలో ఎన్నిక ల గమనం గతి తప్పింది. ఈ కాలంలోనే దేశంలో ప్రాంతీయ పార్టీలు బలో పేతం కావటంతో పరిస్థితిలో గణనీయ మార్పువచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏకఛత్రాధిపత్యానికి తెరపడింది. నిర్దిష్ట కాలపరిమితి లోపల ఎన్నికలు జరుపకూడదంటే ఎన్నికైన వారు నిరంకుశ పోకడలు పోయే ప్రమాదం ఉన్న ది. ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభంగా పరిగణించే ఎన్నికల ప్రక్రియను, కాలాపహరణంగా చూడటం, డబ్బు ఖర్చు కిందికి కుదించటం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధం. రాజకీయ నాయకుడు రాబోయే ఎన్నికల గురించే ఆలోచిస్తాడు, రాజనీతిజ్ఞుడు రాబోయేతరాల గురించి ఆలోచిస్తా డంటారు. ఏక కాల ఎన్నికల పేరిట దేశాన్ని నియంతృత్వంలోకి నెట్టే ప్రయ త్నాలను ఆదిలోనే అడ్డుకోవాలె. ఆదరాబాదరా నిర్ణయాలతో భావితరాల భవిష్యత్తును అంధకారం చే సే అధికారం ఎవరికీ లేదని చాటిచెప్పాలి.

కొత్త జవసత్త్వాలు భ్రమే

“ విత్తమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2017-18 ఆర్థిక సర్వే యావత్తూ ప్రయివేటు పెట్టుబడులూ ప్రజా వ్యతిరేక సంస్కరణలూ జనంపై భారాల చుట్టూనే తిరిగింది. వచ్చే కేంద్ర బడ్జెట్‌కు దశా దిశ ఇదేనని స్పష్టం చేసింది. తమ హయాంలో పూర్తి స్థాయిలో వెలువడే చివరి బడ్జెట్ ఊహల పందిరిగా ఉండబోతోందని సూచనలిచ్చింది. స్థూలోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటుపై మూడేండ్లలో వేసిన అతి అంచనాలు తలకిందులైనా ఈ తడవ సైతం ఆ ధోరణినే పట్టుకొని వేలాడింది. తాము చేపట్టిన 'సంస్కరణ'ల వలన వృద్ధి రేటు పెరుగుతుందని ఊదరగొడుతుండగా వాస్తవంలో గ్రాఫ్ నేలచూపులు చూస్తోంది. నిరుటి సర్వేలో 2017-18లో జీడీపీ వృద్ధి రేటు 6.75 - 7.25 శాతమని అంచనా వేయగా ప్రస్తుతం 6.75శాతానికి ఖాయం చేశారు. చివరికది ఎంత సమోదవుతుందో తెలీదు. ఈ అనుభవం నుంచి గుణపాఠం తీసుకోకుండా వచ్చే ఏడాది వృద్ధి రేటును 7-7.5శాతం సాధించి తీరతామంటు న్నారు. పైపెచ్చు వృద్ధిరేటు సాధనకు ప్రధాన ఇరుసు ప్రయివేటు పెట్టుబడులేనని ఢంకా భజాయిస్తున్నారు. ”



ఉపాధి, ఉద్యోగాల కల్పన, వ్యవసాయాభివృద్ధి, విద్య ఈ నాలుగంశాలూ రానున్న బడ్జెట్‌లో కీలకంగా ఉంటా యంటూనే ఆయా రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెంచకుండా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లను ఆకర్షించి లక్ష్యాలు సాధిస్తామంటున్నా రు. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం నెలకొనడంతో అమెరికా సహా పలు దేశాలు అల్లాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో విదేశాల నుంచి ప్రయివేటు పెట్టుబడులు మన దేశానికి ఇబ్బడిముబ్బడిగా వస్తాయని ఆశించడం ఊహలపల్లకి లో విహరించడమే అవుతుంది. ఏడాదికి కోట్లల్లో ఉద్యోగాలు సృష్టిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీజేపీ ఈ మూడున్నరేండ్లలో ఇచ్చిన ఉద్యోగాలెన్నని అడిగితే చెప్పలేని పరిస్థితి. మేక్ ఇన్ ఇండియాలు, స్టార్టప్‌లు, స్టాండప్‌లు అని ఎంతగా గొంతు చించుకున్నారో దేశం చూసింది.


ఇన్నేండ్లల్లో రాని పెట్టుబడులు వచ్చే ఏడాది వస్తాయనడం మసిపూసి మారేడుకాయ చేసి పొద్దు పుచ్చడానికే. మోడీ సర్కారు వచ్చాక అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ ప్రజలకు భారంగా మారిన పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గలేదు సరికదా ఇంకా పెరిగాయి. రోజువారీగా ధరలు నిర్ణయించే విధానం వలన అవి రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. ఆ విధంగా సమకూరిన వేల కోట్ల రూపాయలు బడ్జెట్ అవసరాలకు ఆసరా అయ్యాయి. కొద్ది మాసాల క్రితం బ్యారెల్ చమురు ధర అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు 40 డాలర్లు ఉండగా ఇప్పుడది 71 డాలర్లకు పెరిగింది. చమురు ధరల పెరుగుదలపై ఆర్థిక సర్వే ఆందోళన వెలిబుచ్చింది. కారణం ఇవి మరింత పెరిగితే మన విదేశీ మారక నిల్వలు తరిగిపోయి సర్వే అంచనాలు తల్లకిందులవుతాయి. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వలన అభివృద్ధి కుంటు పడిందని చెబుతూనే మరోవైపు దానివల్ల 50శాతం పరోక్ష, 18శాతం ప్రత్యక్ష పన్ను చెల్లింపుదార్లు పెరిగినట్టు సర్వే అంచనా. పెద్ద నోట్ల రద్దు వలన ప్రజల పొదుపు పెరిగిందని, అయినా ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధించట్లేదని సర్వేలోనే పేర్కొనడం గమనార్హం.

వాతావరణ మార్పుల వలన కరువు, అధిక ఉష్ణోగ్రతల వలన పంటల ఉత్పాదకత తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేసిన ఆర్థిక సర్వే వ్యవసాయాభివృద్ధికి ప్రయివేటు పెట్టుబడులే కీలకమని వక్కాణించింది. రైతుల ఆదాయాలు రెట్టింపు చేయడంపై అధ్యయనం చేసిన కమిటీ కార్పొరేట్ సాగును దూకుడుగా ప్రవేశపెట్టాలని మొన్ననే సిఫారసు చేసింది. ఆర్థిక సర్వే కూడా అదే దిశగా సూచనలు చేసింది. అప్పుడు రైతులు మార్కెట్ శక్తుల కబంధ హస్తాల్లో చిక్కుతారు మినహా సంక్షోభం పరిష్కారం కాదు. టెలికం రంగంలో జియో రాకతో ఇబ్బందులొచ్చాయన్న ఆర్థిక సర్వే అందుకు స్పెక్ట్రమ్ చార్జీలు తగ్గించాలని పరోక్షంగా సూచించడం కార్పొరేట్లకు లాభాలపంట పండిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలను కాలపరిమితికి లోబడి కాజేయాలని చూస్తున్నది. ఎగుమతుల్లో దిగ్గజ కంపెనీల వాటా అమెరికా, జర్మనీ, మెక్సికోలతో పోల్చుకుంటే చాలా తక్కువని ఆర్థిక సర్వే పేర్కొంది. రాష్ట్రాలు, స్థానిక సంస్థల పన్ను వసూళ్లలో ప్రత్యక్ష పన్నుల వాటా గణనీయంగా తగ్గిపోతున్నదని సర్వే పేర్కొంది. మగ పిల్లలనే కనాలన్న ఆకాంక్ష వలన స్త్రీ, పురుష నిష్పత్తిలో అంతరం ఏర్పడుతోందన్న సర్వే ఉటంకింపు ఆందోళనకరం. నారీ లోకానికి నష్టం జరిగిందని మన్‌కీ బాత్‌లో ప్రధాని మాట్లాడారు.

ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. మహిళలను మాయజేయడానికి ఆర్థిక సర్వే అట్టను పింక్ కలర్‌లో ముద్రించి రాజకీయంగా వాడుకున్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఎందుకు పెట్టడం లేదో పాలకపెద్దలు పెదవి విప్పాలి. సమాధానం చెప్పాలి.

ప్రస్తుత స్టాక్ మార్కెట్ల రికార్డులు బుడగల వంటివని, పేలిపోయిన అనుభవం ప్రపంచానికి ఉందని ఆర్థిక శాఖ ప్రధాన సలహాదారు, ఆర్థిక సర్వే రూపకర్త అరవింద్ సుబ్రమణియన్ అభిప్రాయప డుతున్న తరుణంలో మోడీ సర్కారు ప్రతిపాదించి దూకుడుగా అమలు చేస్తున్న నయాఉదారవాద విధానాలు దేశాన్ని సూపర్ పవర్ చేస్తాయనడం భ్రమే అవుతుంది. ఊహల ఊసులలో చేసిన బాసలు మరిచారు. పెట్టుబడి సేవకు కట్టుబడి ప్రజలకు ప్రపంచీకరణ ప్రవచనాలు, ప్రభోదాలు చేస్తున్నారు. ప్రపంచంలో విఫలమైన సదరు నమూనాతో ప్రజల అభివృద్ధి అసాధ్యం.

బుద్ధుడు సందేశాలు



ధర్మం, వినయం దాచకూడదు

నేను బౌద్ధ సమాజంపై నమ్మకంతో ఉంటాను. బుద్ధుని శిష్యులు మాకు ధర్మ జీవనం ఎలా కొనసాగించాలో నేర్పుతారు. శిష్య సమాజం సత్యాన్ని ఎలా ఆచరణలో పెట్టాలో, నీతి నిజాయితీ ఎలా చూపించాలో మాకు విశదపరుస్తుంది. దయా ధర్మాలు వారిని సోదరులుగా సంఘటితపరుస్తున్నది. వారు రుషులు, మునులు పూజనీయులు నైతిక ధర్మాన్ని పరోపకారాన్ని ఆదర్శంగా బోధించే బౌద్ధ సంఘాన్ని ఆశ్రయిస్తున్నాను. అప్పటి నుంచి బుద్ధుని సందేశం దిన దిన వ్యాప్తి చెందింది. ఆయన ఉపదేశం వినడానికి జనం తరలి వచ్చేవారు. దు:ఖాన్ని తుదముట్టించడా నికి పవిత్ర జీవనం గడుపుతామని దీక్ష పుచ్చు కొనేవారు. అందరికీ స్వయంగా తన సందేశా న్నిచ్చి, కోరిన వారందరికీ దీక్ష ఇవ్వడం అసా ధ్యమని గుర్తించి, బుద్ధుడు తన శిష్యులలో కొందరిని ధర్మ ప్రచారానికి పంపాలని నిశ్చ యించాడు. వారికిలా చెప్పి పంపించాడు. తథాగతుడు ప్రకటించిన ధర్మం, వినయం, ప్రదర్శించినపుడే వెలుగునిస్తాయి. కాని దాచిపెట్టి నందువల్ల ప్రయోజనం లేదు. అయితే ఉత్తమమైన ఈ ధర్మం సత్య సంపూర్ణం అయిన దాన్ని అనర్హుల చేతిలో పడవేయ కూడదు. వారు దాన్ని గేలి చేస్తారు. విమర్శి స్తారు. తిరస్కార భావంతో తూలనాడుతారు. అటువంటివారికి ఈ సిద్ధాం తాన్ని బోధించ వద్దు. ఎవరు అర్హులో, ఎవరు ఉత్సాహం చూపుతారో అలాంటి వారికి దీక్ష ఇవ్వండి. దేశ దేశాలు తిరిగి ధర్మ ప్రచారం చేయడానికి అనుమతి ఇస్తున్నాను. భిక్షువు లారా! మానవ జాతి కల్యాణం కోసం, ప్రపంచంపై ప్రేమతో, దయతో ఈ సందేశాన్ని వ్యాప్తి చేయండి, ఆదిలోను, మధ్యలోను, అంతంలోను, మహత్వం గల ఈ సిద్ధాంతాన్ని భావం, భాష చెడకుండా ప్రబోధించండి. కళ్ళకు మాయ పొర అంతగా కమ్మని వాళ్ళు ఉన్నారు. అలాంటి వారికి ఈ సిద్ధాంతం ఉపదేశించక పోతే ముక్తిని పొందలేరు. వారికి పవిత్ర జీవనాన్ని గురించి ప్రబోధించండి. వారు దీన్ని అర్థం చేసుకొని ఆమోదించి స్వీకరిస్తారు. బౌద్ధ భిక్షువులు ధర్మ ప్రచారం చేస్తూ సంచరిం చడం సంప్రదాయంగా స్థిరపడి పోయింది.

దిన ఫలాలు

గురువారం -1-2-2018

మేషం : గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ప్రముఖుల కలయిక. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడ తారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

వృషభం : దూరప్రాంతాల నుంచి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చ ర్యపరుస్తాయి, రాజకీయ, పారిశ్రామికరంగాల వారికి సన్మాన యోగాలు. వృత్తి,వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

మిథునం : ముఖ్యమైన పనులలో ఎదురైన ఆటంకాలు కొం త వరకు తొలగుతాయి. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. నూతన ప్రయత్నాలలో తొందరపాటు వద్దు.

కర్కాటకం : వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందు తారు. భూ వివాదాలు పరిష్కరించుకుంటారు. పనులలో జాప్యం జరిగినా పూర్తిచేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

సింహం : బాధ్యతలు సమర్థవంతంగా నెరవేరుస్తారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మిత్రులను కలిసి ఆనం దంగా గడుపుతారు. విందు వినోదాలలో పాల్గొంటారు.

కన్య : కొత్త మిత్రులు పరిచయమై సహాయ సహకారాలు అందిస్తారు. విందు వినోదాలలో పాల్గొంటారు. క్రయవి క్రయాలలో లాభాలు వస్తాయి. వాహన కొనుగోలు.

తుల :బంధువులతో ఏర్పడిన విరోధాలు పరిష్కరించు కుం టారు. గృహనిర్మాణ ఆలోచనలో తొందరపాటు వద్దు. ఆక స్మిక ధనలాభం. ఉద్యోగాలలో స్వల్పమార్పులు.

వృశ్చికం : అనుకోని ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఎంత కష్టపడ్డా ఫలితం ఉండదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది.

ధనుస్సు : నూతన వ్యాపారాలు చేపడతారు. ఆకస్మిక ధన లాభం. దూరప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. సన్నిహితుల సహాయంతో ముందుకు సాగుతారు.

మకరం : పనులలో ఆటంకాలు ఎదురైనా సన్నిహితుల సహా యంతో పూర్తిచేస్తారు. అనుకోని సమస్యలు ఎదురైనా అధిగ మిస్తారు.క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

కుంభం : కొత్త ప్రయత్నాలు కలిసివస్తాయి. బంధువులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. విందు వినోదాలలో పాల్గొం టారు. ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

మీనం : ప్రయాణాలు లాభిస్తాయి. ముఖ్యమైన పనులలో విజ యం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ఆర్థిక పరిస్థితి వృద్ధి.

ఆరోగ్యం



రోజూ ఒక అరటిపండుతో...

అరటిపండ్లను శక్తినిచ్చే ఆహార పదార్థంగానే చాలా మంది చూస్తారు. కానీ నిజానికి వాటిలో ఉండే ఔషధ గుణాలు, వాటి వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాల గురించి మాత్రం చాలా మందికి తెలియదు. అరటిపండ్లను రెగ్యులర్‌గా తినడం వల్ల శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలు, పీచు పదార్థం అందుతాయి. దీంతోపాటు పలు అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు. అందుకు మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు. అరటి పండ్లను రెగ్యులర్‌గా తింటే మెడిసిన్ వాడాల్సిన అవసరం లేకుండానే పలు అనారోగ్యాలను నయం చేసుకోవచ్చు. మరి అరటి పండ్లను రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కలిగే 5 అద్భుతమైన ప్రయోజనాలను గురించి ఇప్పుడు తెలుసుకుందామా..!


ప్రిమెన్‌స్ట్రువల్ సింట్రోమ్ (పీఎంఎస్)

అరటి పండ్లలో విటమిన్ బి6 పుష్కలంగా ఉం టుంది. ఇది రక్తంలో ఉన్న గ్లూకోజ్ స్థాయిలను నియం త్రిస్తుంది. అరటి పండ్లను రెగ్యులర్‌గా తింటే అందులో ఉండే బి విటమిన్ల వల్ల పీఎంఎస్ వ్యాధి నుంచి బయట పడవచ్చని అధ్యయనాలు చెబుతున్నా యి. దీంతోపాటు రుతు సమయంలో మహిళలకు వచ్చే కడుపు నొప్పి, ఛాతి నొప్పి, ఇతర సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

హైబీపీ: హైబీపీని నియంత్రించడంలో అరటి పండ్లు అమోఘంగా పనిచేస్తాయి. ఎందుకంటే వీటిల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. అందుకే హైబీపీ తగ్గుతుంది. రోజూ అరటి పండ్లను ఆహారంలో భాగం చేసుకుంటే దాంతో గుండె జబ్బులు కూడా రాకుండా ఉంటాయి.

డిప్రెషన్: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే ప్రొటీన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మన శరీరంలో హ్యాపీ హార్మోన్ అయిన సెరటోనిన్ లెవల్స్‌ను పెంచుతుంది. దీంతో డిప్రెషన్, ఆందోళన, మానసిక ఒత్తిడి సమస్యల నుంచి బయట పడవచ్చు. సెరటోనిన్ మన మూడ్‌ను మార్చి ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది.

చరిత్రలో ఫిబ్రవరి 1



1929 : తెలుగు భాషాభిమాని, సాహితీకారుడు, కవి జువ్వాడి గౌతమరావు జననం.

1945 : భారతీయ సాంకేతిక నిపుణుడు బొక్షి రాజా రాం జననం.

1956 : ప్రముఖ తెలుగు, తమిళ చలనచిత్ర నటుడు మరియు నిర్మాత సుధాకర్ జననం.

1956 : ప్రముఖ తెలుగు సినిమా హాస్య నటుడు కన్నెగంటి బ్రహ్మానందం జననం.

1971 : భారతదేశానికి చెందిన మాజీ క్రికెట్ క్రీడాకా రుడు అజయ్ జడేజా జననం.


1977 : భారత తీర రక్షక దళం ఏర్పాటయింది.

1986 : ప్రముఖ దౌత్యవేత్త, రాజకీయవేత్త మరియు రచయిత ఆల్వా మిర్థాల్ మరణం.

2003 : అమెరికా స్పేస్ షటిల్ కొలంబియా దుర్ఘట నలో భారత సంతతికి చెందిన కల్పనా చావ్లా మర ణం..కల్పనా చావ్లా భారత దేశంలోని హర్యానా రాష్ట్రంలోని కర్నాల్ పట్టణంలో 1962 మార్చి 17 న జన్మించింది. ఆమె పాఠశాలలో చేరినప్పుడు రికార్డుల ప్రకారం అధికార జన్మదినం జూలై 1 1961. తల్లిదం డ్రులకు ఈమె చివరి సంతానం. సునీత, దీప, సంజ య్ ల తర్వాత ఈమె జన్మించారు. ఇంట్లో అందరూ ముద్దుగా "మోంటు" అని పిలుచుకొనే కల్పనా చావ్లా కులీన కుటుంబంలో పుట్టలేదు. తండ్రి బనారసీలాల్ చావ్లా సాధారణ వ్యాపారి కల్పనపై ఆయన ప్రభావం ఎక్కువ. పేదరికం నుంచే ఆయన పైకెదిగారు. పట్టుదల, అందుకు తగిన కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన వ్యక్తి ఆయన. చిన్నగా టైర్ల వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన తొలుత ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. అయినా దాన్ని వదలకుండా అనుకున్నది సాధించేం దుకు ముందుకు సాగిపోయారు. అప్పటి వరకూ టైర్ల తయారీకి విదేశీ యంత్రాన్ని ఉపయోగించేవారు. ఆ క్రమంలో ఆయన దేశీయంగానే ఆ యంత్రాన్ని రూపొం దించారు. బనారసీలాల్ శ్రమ ఫలించింది. రాష్ట్రపతి నుంచీ అభినందనలు అందుకు న్నారు. తర్వాత డబ్బు కోసం బనారసీ కుటుంబం ఇబ్బంది పడింది లేదు. ఆడపిల్లే అయినా జీవితంలో ఏదో సాధించాలన్న తపన కల్పనలో పాదు కోవడానికి తండ్రేకారణం. "పరిస్థి తులు ఎలాగున్నా... కన్న కలల్ని నిజం చేసుకోవడమే అం తిమ లక్ష్యం అన్న మాటలు నా తండ్రి జీవితంలో నిజ మయ్యాయి. ఫలితంగా అవే నాలోనూ జీర్ణించు కుకు పోయాయి. అందుకు నాన్నే కారణం." అంటూ తొలి అంతరిక్షయానం తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆలోచనలు ఏ విధంగా ప్రభావితమయిందీ కల్పన వివరించారు.

తిరుమల చరితామృతం

ధర్మ ప్రచారానికి సమృద్ధిగా నిధులు



పాలకమండళ్ళు కాని, కార్యనిర్వహణా ధికారులు కాని, రెండు సంవత్సరాలు కూడా వారి పదవుల లో వుండే పరిస్థితి లేకపోవడం, అధ్యక్షుడు మారి నా, కార్యనిర్వహణాధికారి మారినా, పాలక మండళ్ళు మారినా, ప్రభుత్వం మారినా, మంత్రులు మారినా.. కార్యక్రమాలకు అంతరాయం కలిగేది. పాత పథకాలు నిర్లక్ష్యం చేసి, కొత్త పథకాలు ప్రారంభించడం, అవి ఊపందుకొనే లోపల బదిలీలు కావడం షరా మామూలే. ధర్మప్రచారానికి అంతే సంగతులు. కార్యక్రమాలు జరుగు తూనే వుంటాయి. ఖర్చవుతూనే ఉంటుంది. కాని ఒక ప్రణా ళిక ప్రకారం ఆశించిన ఫలితాలు వచ్చేవరకూ కార్యక్రమాలు వడిదుడుకులు లేకుండా కొనసాగించే సావకాశం లేని దౌర్భాగ్యస్థితి.. దానితోపాటు తిరుమల దేవస్థానాల కార్యక్ర మాలకు దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల కార్యక్రమా లకు సమన్వయం లోపించడం కూడా జరిగేది. మఠాధిపతులను, పీఠాధిపతులను, ఇతర హిందూ మత సంస్థలను, కలుపుకొని, సమన్వయంతో కార్యక్రమాలు చేయడానికి తగిన అవకాశాలు గాని, వ్యవస్థ కాని లేని పరిస్థితి ఏర్పడింది. ఇదే ఆవేదన, నా తర్వాత వచ్చిన కార్యనిర్వహణాధికారులు, పాలకమండలి అధ్యక్షులు, దేవా దాయ మంత్రులకూ వుందని, వారితో చర్చించినపుడు నాకు తెలిసింది. నాకు కార్యనిర్వహణాధికారిగా అవకాశం వచ్చి నా, హిందూ ధర్మరక్షణ సంస్థను పటిష్టం చేయగలిగినా, మత ప్రచారం ఉద్యమరూపంలో చేయగలగడం కాని, మత మార్పిడులను అరికట్టగల వ్యవస్థాగత వెసులుబాటు చేయ డం కాని జరగలేదన్న అసంతృప్తి అలానే మిగిలిపోయింది. 2005లో నన్ను తిరుమల తిరుపతి దేవస్థానాల సలహాదారుగా నియమించడంతో శ్రీనివాసుడు నాకు ఈ ధర్మప్రచారం విషయంలో ఇంకొక అవకాశం ఇచ్చాడేమోనన్న భావన వచ్చింది. చాలా పట్టుదలతో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఆనాటి పాలకమండలి అధ్యక్షులు శ్రీ సుబ్బరామిరెడ్డిగారు, తర్వాత కరుణాకరరెడ్డిగారు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, కార్యనిర్వహణాధికారులుగా ఉన్న ఏపీవీఎన్ శర్మగారు, తర్వాత మరణాచారిగారు, అటు తర్వాత ఐవైఆర్ కృష్ణారావుగారు ఎంతో ఆసక్తితో, పట్టుదలతో కార్యక్రమాలు చేపట్టడంతో, ధర్మప్రచార కార్యక్రమాలు మంచి ఊపందుకొన్నాయి. ధర్మప్రచారానికి నిధులు సమృద్ధిగా సమ కూర్చడంతో ఎన్నో కొత్త కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడానికి అవకాశం కల్గింది.

అప్పుడు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు, ఆయన క్రైస్తవుడు కాబట్టి, తిరుమలలో అన్యమత ప్రచారం జరుగు తున్నా, ఆలయ అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదనీ, కావాలని ఏడుకొండలను కుదించి, తిరుమల ఆలయ పరిధిని రెండు కొండలు చేశారనీ, కొండమీదనే ఒక క్రైస్తవ చర్చి కట్టడానికి సన్నాహాలు చేస్తున్నారనీ ఆలయ నిధులు ప్రభుత్వానికి మరలించే ప్రయత్నం చేస్తున్నారని చాలా పెద్ద ప్రచారం ప్రారంభమైంది. పెజావరు మఠాధిపతి, విశ్వ హిందూ పరిషత్తులోని ముఖ్యనేత, శ్రీ విశ్వేశతీర్థస్వామీజీ, ఒక విషయ నిర్ధారణ కమిటీని నియమించి, తిరుమల తిరు పతిలలో విచారణలు మొదలుపెట్టారు. ఏదో ఒక అంశంపై ఆ కమిటీ సభ్యులు మీడియాకు చెప్పడం, దానిని దేవస్థానం వారు ఖండించడం మొదలైంది. కొండమీద ఎవరో కరపత్రాలు పంచారనో, మోటరు సైకిలుపై శిలువ చిహ్నం వుందనో, పద్మావతీ విశ్వవిద్యాల యంలో ఏదో జరుగు తోందనో ఆరోపణలు అటువంటివేమీ లేవని దేవస్థానం ఖండన! ఏది ఎలాగున్నా, తిరుమల తిరుపతి దేవస్థానాలు పెద్ద చర్చ నీయాంశమై, ఆలయ ప్రతిష్ట దెబ్బతినే పరిస్థితి! కొండమీద చర్చి కడుతున్నారన్న పెద్ద వదంతులు! ఈ పరిస్థితులలో ఆలయ సలహాదారుగా వున్న నేను దేవస్థానాల అధ్యక్షుడు కరుణాకరరెడ్డి గారితో చర్చిం చారు. మతమార్పిడుల ప్రచారం ఎలావున్నా, హిందూ సమాజం లోని రెండు వర్గాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ, ఆల య ప్రతిష్టకు దెబ్బ తగిలేలా జరుగుతోంది కదా.. విమర్శలు చేసే వాళ్ళ, అన్యమత ప్రచారం జరుగుతోందని ఆరోపణలు చేస్తున్నారు. మన దేవస్థానం ఆశయం అలా జరగకూడదనే కదా? ఇలా బహిరంగంగా విమర్శలు చేసుకొనే బదులు, వారితో చర్చించి, అటువంటి సంఘ టనలు జరగడం లేదని, కావాలంటే అటు వంటివి జరగ కుండా చూడటానికి అందరం కలిసి పనిచేయ వచ్చు కదా! కావాలంటే పెజావరు స్వామీజీతో నేను మాట్లాడి విషయం పరిష్కారం చేస్తాన న్నారు. లేకపోతే రాజకీయ ప్రయోజనాల కోసం ఈ సంద ర్భాన్ని వాడుకోవడానికి అవకాశం వుంటుందన్నాను. కరుణా కరరెడ్డిగారు దానికి ఒప్పుకోవడంతో, పెజావరు స్వామి వారితో చర్చించి వారిని ఒప్పించి, దేవస్థానం వారితో ముఖాముఖి చర్చలు జరిపించి, విషయ పరిష్కారం చేయడం జరిగింది.

వాడపాలెంలో మాఘపౌర్ణమి స్నానాలు

ఎలమంచిలి, న్యూస్‌లీడర్: బుధవారం నాడు మాఘపౌర్ణమిని పురస్కరించుకొని పూడిమడక, రాంబిల్లి, వాడపాలెం సముద్రస్నానాలకు వెళ్లిన భక్తులు అధికసంఖ్యలో భక్తులు పంచదార్ల ధర్మలింగేశ్వర ఆలయంలో గల దార వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు బారులు తీరారు. స్నానం అనంతరం ధర్మలింగేశ్వరుని దర్శించి అనంతరం కల్యాణ వినాయకుడిని, కోటిలింగాన్ని దర్శించుకున్నారు. దీంతో దారపాలెం వద్ద భక్తులు రద్దీ ఏర్పడింది.





ప్రమాదంలో మృతి చెందిన తాపీమేస్త్రీ మాణిక్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి: మరొకరికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ పైడినాయుడు

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
ఇక్కడ కొప్పాక బ్రిడ్జికి సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.
చోడవరం మండలం బెన్నవోలు గ్రామానికి చెందిన మజ్జి పైడినాయుడు, మాణిక్యం అనే ఇద్దరు వ్యక్తులు హీరో హెూండా బైక్‌పై లంకెలపాలెం భవన నిర్మాణ పనులు నిమిత్తం వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ఏపీ 26/టీడీ 1393 గల లారీ ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న మాణిక్యం అక్కడికక్కడ మృతి చెందగా వాహనం నడుపుతున్న మజ్జి పైడినాయుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు.
ప్రమాద సంఘటన తెలుసుకున్న వెంటనే ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ లక్ష్మణరావులు సంఘటనా స్థలానికి హుటాహుటిన వెళ్లి సంఘటనను పరిశీలించి లారీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
మృతుని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా గాయాలపాలైన పైడినాయుడును ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్సను అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయానికి చేరుకొని లబోదిబోమన్నారు.

గిన్నీస్ బుక్‌లో స్థానమే లక్ష్యం

శ్రీ చైతన్య విద్యార్థిని కలగర్ల సాహితి



నేలపై ఆసనాలు వేస్తున్న చిన్నారి — చిన్నారిని అభినందిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, న్యూస్‌లీడర్:
నర్సీపట్నం శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చిన్నారి కలగర్ల సాహితి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సాధించాలని పట్టుదలతో కృషి చేస్తుంది. నేలపై ఆసనాలు వేయడం పరిపాటి. పట్టుదలతో తనకంటూ ఒక ప్రత్యేకత ఉండాలనే దృష్టిలో ఆరవ ఏట నుండే ఈతలో ప్రతిభ కనబరుస్తున్న ఈ చిన్నారి, నీటిపై ఆసనాలు మొదలుపెట్టింది. తల్లి నాగజ్యోతి, పాఠశాల గురువుల ప్రోత్సాహంతో ప్రత్యేక అభ్యసనాలు చేస్తున్న సాహితి అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభ చూపి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్సులో తన పేరు నమోదు కావాలని, డాక్టరు చదివి ఆసనాలు నేర్పే గురువు కావాలన్నది తన జీవితాశయమని అంటోంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో పాఠశాల ప్రిన్సిపాల్ అయిన మండ సూర్యనారాయణమూర్తి, ఆర్ఐ.మాకిరెడ్డి రమణ, ఏజీఎం సురేష్ చిన్నారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ సంతోష్, ఇన్‌చార్జ్ సురేంద్ర, ప్రైమరీ ఇన్‌చార్జ్ మైథిలి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు పంపిణీ బాధ్యత డీలర్లదే

తహసీల్దార్ బి.సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

అనకాపల్లి రూరల్, న్యూస్‌లీడర్:
రేషన్ సరుకులు పంపిణీ బాధ్యత డీలర్లదేనని తహసీల్దార్ బి.సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరుచేసిందన్నారు. అయితే సరుకుల పంపిణీ కార్డు వినియోగదారులకు సకాలంలో అందేలా డీలర్లు కృషి చేయాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ సరుకులు అందివ్వాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్‌సరుకుల పంపిణీలో డీలర్లు తమ వంతు సహాయ సహకారాలందించాలన్నారు. పట్టణ, మండల పరిధిల్లో 88 డిపోలకు గాను 593 రేషన్‌కార్డులు మంజూరయ్యాయన్నారు. మంజూరైన వారి దగ్గర నుంచి పది రూపాయలు తీసుకొని కార్డుకు రిజిస్ట్రేషన్ చేసి వారి పేరిట సరుకులు అందుతాయన్నారు. చంద్రన్న సంక్రాంతి కానుకలు కార్డుదారులకు సరఫరా చేయగా మిగిలినవి తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పాలన్నారు. రేషన్‌కార్డులో ఉన్న వారు మృతిచెందినా, ఉద్యోగాలు వచ్చినా వారి పేర్లను కార్డులోంచి తొలగించాలన్నారు. అలాగే రేషన్ సరుకులకు వేలిముద్రలు పడని వారిని గుర్తించి ఏడో తేదీ నుంచి పదో తేదీ వరకు వారికి ప్రత్యేక సమయం కేటాయించి వారికి బయోమెట్రిక్ సరిగా లేనియెడల బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించి సరుకుల అందేలా చూడాల్సిన బాధ్యత డీలర్లదేనన్నారు. ఇటీవల జరిగిన రేషన్‌డిపోల సామాజిక తనిఖీకి సంబంధించిన రిపోర్టు మొత్తం జేసీకి అందజేయడం జరిగిందని అలాగే దీనిపై అభియోగాలున్న డిపోలపై టాస్క్‌ఫోర్స్ ద్వారా తనిఖీలు చేయడం జరుగుతుందని వారిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ అన్నారు. సీఎస్‌డీటీ బలరామకృష్ణ మాట్లాడుతూ కొత్తగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే భార్యాభర్తలు ముందుగా వారి తల్లిదండ్రులు వారి రేషన్‌కార్డు నుంచి వారి పేర్లను తొలగించుకొని కొత్త రేషన్‌కార్డులో వారి పేర్లను నమోదు చేయించుకోవచ్చునన్నారు. అలాగే రేషన్‌కార్డుకు దరఖాస్తుకొనే వారు వారి తల్లిదండ్రుల ఇంటి డోర్ నంబరు కాకుండా వేరే ఇంటి డోర్‌నంబరు కలిగి ఉండి అందులో ఉంటేనే వారికి రేషన్‌కార్డు మంజూరు చేయడమవుతుందన్నారు. ఈ సమావేశంలో రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ మిత్రపక్షాలను గెలిపించండి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోనలక్ష్మణ

అనకాపల్లిటౌన్, న్యూస్‌లీడర్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరగనున్న గుర్తింపు కార్మికసంఘ ఎన్నికల్లో ఏఐటీయూసీ అభ్యర్థులకు గులాబి గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోనలక్ష్మణ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల సమావేశం స్థానిక గోవిందరావు భవనంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి పథంలో నడవాలన్నా, తక్షణం వేతన ఒప్పందం జరగాలన్న కార్మికుల ఆర్థిక ప్రయోజనాలతో పాటు వారి సంక్షేమ కార్యక్రమాలు అమలుజరగాలన్నా ఆదినారాయణ నాయకత్వంలో ఏఐటీయూసీ మిత్రపక్షాలకు ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీరామదాసు అబ్బులు, కోదూరి వీరాచారి, గోవిందరావు, కుండల చిలుకుబాబు, చవితిన నూకరాజు, సూరిబాబు, కర్రి సూర్యనారాయణ, పల్లా సత్తిబాబు, బత్తిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్

రోలుగుంట, న్యూస్‌లీడర్: మండల కేంద్రంలో వచ్చే నెల 7, 8 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గౌరీపరమేశ్వరుల మహోత్సవాల సందర్భంగా బాలురు, బాలికలకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 7వ తేదీన బాలికలకు, 8న బాలురకు పోటీలను జరుగుతాయన్నారు. ప్రవేశ రుసుం రూ.200 చెల్లించాలని, 6వ తేదీ సాయంత్రంలోగా పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. పూర్తి సమాచారం కోసం 9618662054, 8074169316, 9154534645 నంబర్లను సంప్రదించాలని కోరారు.

1న సహ చట్టం కార్యకర్తల నిరాహార దీక్ష

మాడుగుల, న్యూస్‌లీడర్: సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్లను వెంటనే నియమించాలని కోరుతూ ఒకటవ తేదీ గురువారం ఉదయం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద సహ చట్టం కార్యకర్తలు నిరాహార దీక్షలు చేస్తున్నారని మండల ప్రచార ఐక్యవేదిక మండల అధ్యక్షులు సురేష్ సొంతో తెలిపారు. ఈ కార్యక్రమానికి సమాచార హక్కు చట్టం కార్యకర్తలందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

ఎంపిడిఓ యాదగిరీశ్వరరావు

నాతవరం, న్యూస్‌లీడర్: మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఓ ఎల్.యాదగిరీశ్వరరావు అన్నారు. ఆయన జిల్లేడుపూడి, ఎం.బెన్నవరం, యర్రవరం తదితర గ్రామాల్లో పర్యటించి మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెలాఖరికి మండలాన్ని ఓడిఎఫ్‌గా మార్చడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ప్రతీ గ్రామంతో పాటు మండలాన్ని ఓడిఎఫ్‌గా తీర్చిదిద్దడేమ లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఆరుబయట మలవిసర్జన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. లబ్ధిదారునికి ఒక్కో మరుగుదొడ్డికి 15వేల రూపాయలు ఇస్తుంటే వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ ఉన్నారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

1న గుడ్‌షెపర్డ్ వార్షికోత్సవం

అనకాపల్లి, న్యూస్‌లీడర్: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రంలో గుడ్‌షెపర్డ్ స్కూల్ 39వ వార్షికోత్సవం గురువారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నామని పాఠశాల కరస్పాండెంట్ పాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీకాంతిలాల్ దండే (ఐఏఎస్), డైట్ కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రొఫెసర్ డెమస్, ఐవిన్‌సెంట్ (యుఎస్ఏ) పాల్గొంటారని పాల్ తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా స్కూల్ విద్యార్థినీ విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక ఆకర్షణగా లైట్ అండ్ సౌండ్స్, స్వాతంత్ర్య పోరాటంనకు సంబంధించి 30 నిముషంల్లో మన దేశ స్వాతంత్ర్య సమరయోధుల తమ దేశభక్తిని, పరిపాలనా తిరుగుబాటుకు వివిధ పోరాటాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల కరస్పాండెంట్ పాల్

మోడల్ స్కూలును సందర్శించిన ట్రైనీ కలెక్టర్



వివరాలు అడుగుతున్న ట్రైనీ కలెక్టర్ మిషాసింగ్

కశింకోట, న్యూస్‌లీడర్:
మండలంలోని తేగాడ మోడల్ స్కూలులో ట్రైనింగ్ కలెక్టర్ మిషాసింగ్ బుధవారం ఉదయం సందర్శించారు. కలెక్టర్ ట్రైనింగులో భాగంగా తేగాడ మోడల్ స్కూలులో పిల్లలకు విద్యను ఏవిధంగా బోధిస్తున్నారో వారి సదుపాయాలు ఏవిధంగా ఉన్నాయో, పరిశుభ్రమైన, పౌష్టికాహారమైన భోజనం పెడుతున్నారో లేదో, మంచినీటి సమస్యలపై, తదితర అంశాలపై అవగాహన చేసుకోవడానికి ప్రిన్సిపాల్ పీటీఎస్ శ్రీలక్ష్మి తెలిపారు. ట్రైనింగు కలెక్టర్ రోజుకు శాఖపై ట్రైనింగులో భాగంగా బుధవారం విద్యాశాఖపై వివరాలు తెలుసుకోవడానికి వచ్చారన్నారు. మండలంలోని ఐదు కస్తూరిబా పాఠశాలలు, తాళ్లపాలెం హైస్కూలు, చింతలపాలెం, కశింకోట హైస్కూళ్లకు వెళ్లి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటారన్నారు. ట్రైనింగు కలెక్టర్‌తో డిప్యూటీ డీఈవో సునీత, ఎంఈవో మధుసూధనరావు, ఎంపీపీ పంచదార్ల లక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

పాఠశాలకు మంచినీటి బోరు మంజూరు


కశింకోట, న్యూస్‌లీడర్:
మండలంలోని తేగాడ గ్రామంలో కస్తూరిబా పాఠశాలలో మంచినీరుకి ఇబ్బంది పడుతున్నామని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీపీ పంచదార్ల లక్ష్మి, ఎంపీడీవో బీవీ సత్యనారాయణ, తేగాడ ఎంపీటీసీ బాబూరావు బుధవారం కస్తూరిబా పాఠశాలను సందర్శించారు. కస్తూరిబా పాఠశాల ఎస్‌వో అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బోరు నీరు రావడంలేదని, మంచినీరుకి, స్నానాలకు ఇబ్బందిగా ఉందని, మరో హ్యాండ్ బోరు మంజూరు చేయాలని ఎంపీపీ పంచదార్ల లక్ష్మిని కోరారు. పాముల బెడద ఎక్కువగా ఉండడంతో స్కూలు చుట్టూ ప్రహారీగోడ నిర్మించాలన్నారు. పాఠశాలకు సీసీ రోడ్డు వేయిందాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ ఎంపీపీ నిధులతో తక్షణ బోరు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్కూలులో డిజిటల్ క్లాసులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీవీ సత్యనారాయణ, పంచదార్ల సూరిబాబు, ఎంపీటీసీ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి


ఎస్ఐ ధనుంజయ్



పేకాట రాయుళ్లను పట్టుకున్న దృశ్యం

మాడుగుల, న్యూస్‌లీడర్:
మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిపెట్టామని ఎస్ఐ రాజాన ధనుంజయ్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన మాట్లాడుతూ మండలంలో పేకాటలు ఎక్కువగా ఆడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని, వాటిపై దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాగరం పంచాయతీ వాడపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని 2,600 నగదును స్వాధీనం చేసుకొని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టిపెట్టామని, అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వ్యాన్‌ను గొటివాడ సమీపంలో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా జరిగినా, గ్రామాలలో పేకాటలు నిర్వహించినా స్టేషన్‌కు సమాధానం అందించాలని ఆయన కోరారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో ఎంఆర్ స్కాన్ ఏర్పాటు చేయాలి



ఏపీ వైద్యవిధానపరిషత్ మౌలిక సంస్థ ఎండీ, చైర్మన్‌లకు వినతిపత్రం అందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ నారాయణరావు

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రికి ఎంఆర్ స్కాన్‌ను మంజూరు చేయాలని ఏపీ వైద్యవిదానపరిషత్ మౌలిక సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేకేవీఏ నారాయణరావు కోరారు. విజయవాడలో జరిగిన ఏపీఎంఎస్ఐడీసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎండీ రవీంద్రనాథ్, చైర్మన్ లక్ష్మీపతి, మరో డైరెక్టర్ సాయి సుబ్రహ్మణ్యం రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, సామగ్రి కొనుగోలు, మందుల బడ్జెట్‌పై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఆస్పత్రికి కావాల్సిన పరికరాలపై చర్చించి వినతిపత్రం అందజేసినట్లు డాక్టర్ నారాయణరావు తెలిపారు. ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటర్, రక్తనిధి కేంద్రం ఆధునీకరణ, మోడరన్ మార్చురీ, సూపర్ స్పెషాలిటీ ఛాంబర్‌ల ఏర్పాటుపై సంస్థ ఎండీ చైర్మన్‌ను కోరామని డాక్టర్ నారాయణరావు అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక, న్యూస్‌లీడర్:
ట్రాఫిక్ నిబంధనలపై మునగపాక ఎస్ఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో బుధవారం వాహనదారులకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. గ్రామస్థులతో కలిసి ప్లకార్డులు పట్టుకొని మునగపాక ప్రధాన జంక్షన్‌వద్ద ప్రదర్శన చేశారు. అలాగే ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ స్వామినాయుడు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. బుధవారం పూడిమడక జాతర సందర్భంగా అధిక వాహనాలు ఈ మార్గంలో వస్తుండడంతో ఎక్కువ మంది వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంటుందని దీంతో ఇక్కడ ఈ కార్యక్రమం చేపట్టామని ఎస్ఐ స్వామినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మళ్ల కృష్ణ, ఎ.బాలకృష్ణ, దాడి అప్పలనాయుడు, ఎస్.బ్రహ్మాజీ, ఆళ్ల మహేశ్వరరావు, ఏఎస్ఐ మణికుమారి, హెచ్‌సీ నాయుడుబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవాసంఘం

ప్రధాన కార్యదర్శిగా పైడిరాజు



ఎస్‌పేడీ, న్యూస్‌లీడర్:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శిగా నరవ పైడిరాజు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘము మహాజన సభలో భాగముగా ఆయన ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే సంఘ అధ్యక్షుడిగా కడప జిల్లాకు చెందిన ఎస్.యానాదయ్య ఎంపికయ్యారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా విశాఖకు చెందిన వేపడపు నూకరాజు ఎంపికయ్యారు. సంఘ అభ్యున్నతికై పార్టీ అభ్యున్నతికి, కృషి చేస్తామని సందర్భంగా ఎంపికైన వారు తెలిపారు. సంఘ సభ్యుల్ని అందరినీ కలుపుకుని సంఘ అభివృద్ధికి దోహద పడతామని పేర్కొన్నారు. సంఘ సమస్యల్ని ఎప్పటికప్పుడు నివృతం చేసుకుని వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఎంపికైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తుల సముద్ర స్నానాలు



సముద్ర స్నానాలలో పాల్గొన్న భక్తులు

ఎలమంచిలి, న్యూస్‌లీడర్:
రాంబిల్లి మండలం వాడపాలెం సముద్రతీరంలో మాఘపౌర్ణమి స్నానాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై మాఘపౌర్ణమి స్నానాలు ఆచరించారు. మంగళవారం రాత్రి నుంచే అధికసంఖ్యలో భక్తులు హాజరై తెల్లవారుజామున సముద్రపు స్నానాలు ఆచరించారు. ఉదయం మరింత మంది స్నానాలకు రావడంతో లోతట్టు ప్రాంతంలోకి భక్తులు వెళ్లకుండా స్థానిక ఎస్ఐ చక్రధరరావు ఆధ్వర్యంలో పోలీసులు భక్తులకు సూచనలు ఇచ్చారు. స్నానం అనంతరం సముద్రతీరంలో గల గంగాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారశ్రీను. ఫ్రెండ్ యూత్ వారు ఉచిత పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ స్వామినాయుడు

మునగపాక, న్యూస్‌లీడర్: మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి మునగపాక ఎస్ఐ అల్లు స్వామినాయుడు, జన్మభూమి కమిటీ సభ్యుడు మళ్ల వరహా నర్సింగరావులు బహుమతులు అందజేశారు. తీర్థ మహోత్సవాల్లో ఇటువంటి పోటీలను నిర్వహించి మహిళలను ప్రోత్సహించడం అభినందనీయమని ఎస్ఐ స్వామినాయుడు నిర్వాహకులకు అభినందించారు.

టీ దుకాణం యజమానురాలి ఉదారత

మాడుగుల, న్యూస్‌లీడర్:
మండలంలోని కేజేపురం మెయిన్‌రోడ్డులో గత కొన్ని సంవత్సరాలుగా టీ దుకాణం యజమానురాలు మారుముఖం కొండమ్మ తాను చనిపోతూ శ్రీసంతోషిమాత ఆలయానికి స్థలాన్ని విరాళంగా అందించింది. ఈ విషయంపై బుధవారం ఉదయం శ్రీసంతోషిమాత ఆలయ కమిటీ ఛైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు మాట్లాడుతూ కొండమ్మ చనిపోయిన తరువాత ఆమె పేరున ఉన్న స్థలాన్ని ఆమె సోదరులు కామునాయుడు, రమణ, అప్పారావు స్థలాన్ని విరాళంగా అందించారని తెలిపారు. ఈ స్థలంలో భక్తులకు విశ్రాంతి భవనం నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. కొండమ్మ చనిపోయినా ఆమె చేసిన పుణ్యకార్యం అందరికి చిరస్థాయిగా ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

వాకర్స్‌క్లబ్ సమావేశం

తుమ్మపాల(అనకాపల్లి), న్యూస్‌లీడర్:
శారీరక శ్రమతోనే ఆరోగ్యం పదిలమవుతుందని నిత్యం నడక, యోగా వంటి చేయడం వలన మానసిక ఒత్తిడి జయించవచ్చునని వాకర్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు హాల్‌లో జరిగిన వాకర్స్‌క్లబ్ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, మన ఆరోగ్యం సంరక్షణ మన చేతిలో ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యపరమైన సూత్రాలు పాటిస్తూ జీవితాన్ని ఆనందదాయకం చేసుకోవాలన్నారు. వయసు మీదపడటం వలన శరీరంలోని అనేక మార్పులు వస్తాయని, బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వీటిపై తగు జాగ్రత్తలు తీసుకొని వైద్యుల సలహాలు పాటించాలన్నారు. నడక వలన ఎన్నో లాభాలున్నాయని ఈ తరం యువత నడకకు బదులుగా వాహనాలపై ప్రయాణం చేయడం వలన ఆరోగ్యపరమైన ఇబ్బందులు చిన్న వయసు నుంచే తలెత్తుతున్నాయన్నారు.



ఈ క్లబ్ ద్వారా జరిగే కార్యక్రమాలు వలన క్లబ్ ఎంతో ముందుకు వెళ్తుందని ఇలాగే కొనసాగితే జిల్లాలో వాకర్స్‌క్లబ్‌కు మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు యల్లపు సాంబశివరావు (శివ), కార్యదర్శి దొడ్డి రమేష్, కోశాధికారి కుండల రామకృష్ణ, నల్లల దేముళ్లు, కేవీ గౌరీపతి, రిటైర్డు ఎస్ఐ ఎస్.ప్రభాకర్‌రావు, డాక్టర్ డీడీ నాయుడు, బోయిన నాగేశ్వరరావు, ఎం.కూర్మారావు, కె. రమణఅప్పారావు, శరగడం నూకరాజు, మళ్ల సత్యనారాయణ, ఫారెస్టు ఆఫీసర్ సత్యనారాయణ, డీవీ కృష్ణారావు, ఆదినారాయణ, కె.పాపయ్యశాస్త్రి, శరగడం కాళిదాసు పాల్గొన్నారు.

40మంది యువకుల రక్తదానం

మునగపాక, న్యూస్‌లీడర్: మండలంలోని మునగపాకవద్ద మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ జన్మదినం సందర్భంగా ఇక్కడ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మళ్ల జోగారావు, బొడ్డేడ అప్పలనాయుడు, కొణతాల సంతోష్, గంగప్పలనాయుడు, పల్లె నాయుడు పాల్గొన్నారు.

కెమిక్ కంపెనీ కార్మికుడు మృతి

పరవాడ, న్యూస్‌లీడర్: మండలంలో ఫార్మాసిటీ ఎస్ఈజెడ్‌లో ఉన్న కెమిక్ మెకానికల్ ఇంజనీరింగ్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడు సీహెచ్ జగదీశ్వరరావు (33) విధులు ముగించుకొని ఇంటికివెళ్లి రాత్రి నిద్రిస్తూ బుధవారం తెల్లవారేసరికే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే ఏదుమెట్ల మర్రిపాలెం ఫార్మా కాలనీకి చెందిన సీహెచ్ జగదీశ్వరరావు ఈయన కెమిక్ మెకానికల్ ఇంజనీరింగు మెయింటేనెన్స్ కాంట్రాక్ట్ కార్మికుడిగా మంగళవారం ఉదయం విధులకు హాజరై సాయంత్రం ఐదు గంటలకు విధుల నుంచి రావలసిన జగదీశ్వరరావు ఓటీ చేసుకొని రాత్రి పది గంటలకు ఇంటికి వెళ్లాడు. రాత్రి భోజనం చేసి నిద్రపోయాడని భార్య తెలిపింది. ఈయనకు భార్య భారతి, ఒక పాప ఉన్నారు. ఈ విషయం కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కంపెనీ యాజమాన్యం కుటుంబ సభ్యులతో చర్చలు జరుపుతున్నారు.

2వ మెగా పోస్టల్ పొదుపు ఖాతాలు, పీఎల్ఐ మేళా

విజయనగరం,న్యూస్‌లీడర్ : ఫిబ్రవరి 2 నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెగా మేళా నిర్వహిస్తామని ఈ మేళాలో పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్సు, పొదుపు ఖాతాలు భారీ స్థాయిలో ప్రారంభిస్తామని విజయనగరం డివిజన్ పోస్టల్ పర్యవేక్షకులు పి. ఆనందరావు తెలిపారు. ఈ మేళాకు విజయవాడ సర్కిల్ ప్రధాన పోస్ట్ మాస్టర్ జనరల్ కె.సుబ్రమణ్యన్ హాజరు కానున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వోద్యోగులు , ప్రైవేట సంస్థల ఉద్యోగులు పాల్గొనవచ్చన్నారు. రూ. 50లు కనీస డిపాజిట్‌తో పొదుపు ఖాతాలు తెరిపిస్తామని సాదారణ వ్యక్తులకు కూడా పొదుపు అలవాటు చేయటానికి ఈ మేళా ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

ఘనంగా మన్యుసూక్త హోమం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : నగరంలోని మెయిన్‌రోడ్డులో గల శ్రీ ఆంజనే యస్వామి దేవాలయంలో బుధవారం శాస్త్రోక్తంగా మ న్యుసూక్త హోమం నిర్వహించారు. మాఘపౌర్ణమి సందర్భంగా జరిగే ఈ కార్యక్రమంలో అధిక సం ఖ్య లో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు.

ప్రజలకు అండగా ఉంటాం : వాసుపల్లి



సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బుక్కా వీధికి చెందిని మోగన్న అనే మహిళలకు రూ.2వేలు ఆర్థిక సాయం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పేద ప్రజలకు ఎప్పుడూ అండగా వుంటా మన్నారు. ఎంవీపీఎం పాఠశాల,ఫిషింగ్ హార్బర్,దొండపర్తి ప్రాంతాల్లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలను నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కొల్లి సింహాచలం, బెహరా వెంకటరత్నం, ముస్నం బాలాజీ, అల్లూరి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీ శివప్రసాద్, చింతకాయల వాను, అప్పలరాజు జర్రుల్లా పాల్గొన్నారు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: మంచి ఆహారం అలవాటు చేసుకోవడం ద్వారానే ఆరోగ్యం లభిస్తుందని ఆహార నిపుణురాలు హారిణి తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధిక బరువు తగ్గేందుకు బాదంతో పాటు అవిసె గింజలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. స్నెక్స్ తీసుకునే సమయంలో డ్రై రోస్ట్ బాదం కొద్దికొద్దిగా తినడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు ప్రతి ఒక్కరు కొన్ని ఆహార నియమాలుతో పాటు అల్కహాలు, దూమపానాన్ని విడిచిపెట్టాలన్నారు.

దేవాదాయశాఖ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మంగిపూడి



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న మంగిపూడి ప్రసాద్ ఉపాధ్యక్షనిగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సర్వసభ్య సమావేశంలో జరిగిన ఎన్నికలో మంగిపూడి ప్రసాద్ ఉపాధ్యక్షనిగాను, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా ఉపకమీషనర్ కార్యా లయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న కె.ఎల్.సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హిందూ బాబాయ్ ఇక లేరు



హిందూ రిపోర్టర్ చలపతిరావు

విజయనగరం, న్యూస్‌లీడర్: హిందూ స్టాఫ్ రిపోర్టర్ వి. చలపతిరావు (సీనియర్ జర్నలిస్ట్,) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. దక్కన్‌క్రానికల్‌లోను, హిందూ పత్రికలోనూ కొన్నేళ్ళుగా జర్నలిస్టుగా పనిచేస్తూ అందరి మన్ననలనూ పొందారు. నిజాయితీకి నిబద్ధతగా, ఆదర్శవంతమైన జర్నలిస్టుగా వెలుగొందుతూ అందరితో కలిసిమెలసి ముందుకు వెళ్లేవారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల విజయనగరం జిల్లా జర్నలిస్టులు, రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తీవ్ర సంతాపం ప్రకటించారు. జర్నలిస్టు మిత్రులందరు బాబాయ్‌గా నిత్యం పలకరించే చలపతిరావు తన 67 ఏట కూడా నేటితరం జర్నలిస్టులతో సమానంగా చురుగ్గా పనిచేయటం పలువురికి స్ఫూర్తి నిచ్చేది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ సందర్భంగా ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు దిమిలి అచ్యుతరావు, జిల్లా నాయకులు శివప్రసాద్, పాత్రో, వై.ఎస్.పంతులు, రాధాకృష్ణ, కఠారి రవి, పందాది అప్పారావు, లింగాల నరసింగరావు, రామకృష్ణ, భరద్వాజచక్రవర్తి, గొట్టాపు త్రినాథ్, ఆలవిల్లి కిశోర్, సుబ్బారావు, శ్రీను, ఎం.విజయభాస్కర్, ఎమ్.ఎస్.ఎన్.రాజు, వేదుల సత్యనారాయణ, రొబ్బి దాలిరాజు, మూర్తి తదితరులు ఒక ప్రకటనలో తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

గ్రహణం అనుకూలంగా మార్చుకుంటే చంద్రమహాదశ



విజయనగరం, న్యూస్‌లీడర్: సుమారు 151 ఏళ్ళ తరువాత అరుదుగా వచ్చే సంపూర్ణ చంద్రగ్రహణాన్ని ఎవరైనా తిలకించవచ్చని శాస్త్రజ్ఞులు స్పష్ట చేశారు. ఒకేసారి మూడు రంగుల్లో కన్పించే ఈ గ్రహణం వల్ల అనేక భౌగోళిక మార్పులపై పరిశోధనలకు అనుగుణంగా ఉంటుందని చెబుతున్నారు. గ్రహణ సమయంలో గురువు ఉపదేశించిన మంత్రాలు పఠిస్తే ఒక ఏడాదిలో చేసి పూజలకు సమానమని పలువురు తెలిపారు. ఇష్టదేవతలను గ్రహణ సమయంలో ప్రార్థిస్తే సకల పాపాలు హరించి చంద్రమహాదశ కలుగుతుందని పలువురు విశ్వాసం వ్యక్తం చేశారు. సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా విజయనగరం జిల్లాలోని పలు దేవాలయాలు మూసివేశారు. ఉదయం నుంచి యథావిధిగా పూజలు నిర్వహించిన తరువాత 10 గంటల నుంచి గర్భగుడిని మూసివేశారు. గురువారం ఉదయం సంప్రోక్షణ తరువాత దేవాలయాలను మళ్లీ తెరుస్తారు. అనంతరం భక్తుల దర్శనానికి అనుమతి ఇస్తారు. జిల్లాలోని ప్రముఖ దేవాలయాలైన పైడితల్లి అమ్మవారి దేవాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, రామతీర్థంలోని సీతారామస్వామి ఆలయం, తోటపల్లిలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం, బొబ్బిలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, పుణ్యగిరి శివాలయం తదితర దేవాలయాలు కూడా మూసివేశారు.

ఉపాధి పనుల్లో అక్రమాలను సహించం



నరసన్నపేట,న్యూస్‌లీడర్: మహాత్మ గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పనులలో అక్రమాలకు పాల్పుడరాదని డీఆర్‌డీఏ పీఓ ఆర్.స్వరూపారాణి అన్నారు.స్థానిక మాజిక తనిఖీల ప్రజా వేదిక లను ఎంపిడివో కార్యాలయం వద్ద నిర్వహించారు.ఈసందర్భంగా స్వరూపారాణి మాట్లాడుతు,గ్రామీణ వలస కూలీలను నివారించడ కేంద్ర ప్రభుత్వం దీనిని అమలు చేసిందని అందుకు గ్రామములో పనులు చేసుకుంటు వలసపోకుండ దీనిని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.అందుకు ఫీల్డు వర్కర్స్ సక్రమంగా దగ్గరుండి పనులు జరిపించవలసిన అవసరం ఉందని చెప్పారు.వీరు చేస్తున్న పనులను పరిశీలించి తగిన కూలీ సకాలంలో చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో,జడ్పీటీసి చింతు శకుంతల,మండల ప్రత్యేక ఆహ్వానితులు డి.వి.వో ఆర్.వి.రమణ,ఎపిడి సైలజా,ఎ.పి.ఓ డి.వి.వి.ఆర్ మూర్తి.ఎంపిడివో డా.డి.వి.విధ్యాసాగర్.కె.సత్యమూర్తి,ఎంపిటీసీలు పీస క్రిష్ణ,జామి వెంకట రావు,ఎపివో యుగందర్,డి.పి.ఎ సీతారామయ్య.యస్ఆర్‌పి సింహద్రి,ఎం,రవి,తదితరలు పాల్గున్నారు.



నగర కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వినర్‌గా కె గోపాల్ రెడ్డి నియమితులైన సందర్భంగా బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయనను పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు శాలువకప్పి అభినందించారు. **- న్యూస్‌లీడర్ , విశాఖపట్నం.**

సీసీ రోడ్డు శుంకుస్థాపన

మల్కాపురం, న్యూస్‌లీడర్ మల్కాపురం జీవీఎంసీ 45 వార్డు ఏ.కే సి లో 45 వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిల్లా అచ్చిరావు సి.సి రోడ్డు లను బుధ వారం శుంకుస్థాపన చేశారు .ఈ కార్యక్రమం నాకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు టీడీపి మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు

కుష్టు వ్యాధి నిర్మూలనుకు అందరు కృషి చేయాలి



నరసన్నపేట,న్యూస్‌లీడర్-:కుష్టి వ్యాది నిర్మూలనకు అందరు కలసి కట్టుగా కృషి చేయాలని మేజర్ పంచాయితి సర్పంచ్ గొద్దు.చిట్టిబాబు అన్నారు.మహత్మ గాంధీ వర్ధంతి సందర్బంగా కుష్టి వ్యాది నిర్మూలన దినోత్సవం కలుపుకొని కుష్టి వ్యాదిగ్రస్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితి ఇ వోఆర్డి మధుసూదనరావు,డా.అప్పలనాయుడు,రాంకుమార్ నాగభూష న రావు, ఎఎన్ఎం క్రిష్ణవేణి తదితరలు పాల్గున్నారు.

ఐక్య ఉద్యమాలే ప్లాంట్‌కు రక్ష

గాజువాక, న్యూస్‌లీడర్: ఐక్య ఉద్యమాల వలనే ప్లాంట్ రక్షించబడుతుందని, వీటిని నిర్మించగల సీఐటీయూనే గెలిపించండి అని అఖిలభారత సీఐటీయూ నాయకులు ఎన్. రామారావు అన్నారు. ఉక్కు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉక్కు కర్మాగారంలో అన్ని విభాగాలలో సీఐటీయూ మిత్రపక్షాలతో ప్రచాన్ని నిర్వహించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వలన విశాఖ ఉక్కుకు ప్రైవేటీకరణ ప్రమాదం ఉందని, దీనిని సమర్థవంతంగా తిప్పికొట్టడానికి మన ఐక్య ఉద్యమాలు దోహదపడతాయని ఆయన వివరించారు. ఐక్యతకు మనం ఇచ్చే ప్రాధాన్యతను గుర్తించే ఏడు సంఘాలు మద్దతు ఇచ్చాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మిత్రపక్షల నాయకులు పాడి త్రినాథ్, గణపతిరెడ్డి, బొడ్డ పైడిరాజు, డి.వి.రమణారెడ్డి, సీహెచ్ సన్యాసిరావు, డి. సురేష్‌బాబు, టి. జగదీష్, రాంకుమార్, ఎం. మహాలక్ష్మినాయుడు, కృష్ణరావు, దొమ్మేటి అప్పారావు, ప్రకాశ్, సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, వైటీ దాసు, జె. సింహాచలం, ఆయా విభాగాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

ట్రాఫిక్ ఏడీసీపీగా రమేష్‌కుమార్



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ట్రాఫిక్ ఏడీసీపీగా రమేష్‌కుమార్ నగర పోలీస్ కమిషనరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. 1985 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా గుంటూరు రేంజ్‌లో పని చేసారు. ప్రమోషన్‌పై విశాఖకు ట్రాఫిక్ ఏడీసీపీగా బదిలీపై వచ్చారు.

యువతకు వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాలు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గ ఆర్థిక సంస్థ (ఏపి స్టేట్ క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్) క్రిస్టియన్ మైనార్టీస్ నిరుద్యోగులకు వివిధ రంగాలలో ఉచిత శిక్షణా కార్యక్రమాల ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుటకు పూనుకొనుట జరిగింది. ఈ సంస్థ ద్వారా క్రిస్టియన్ మైనార్టీస్ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుచుకొనడమే కాకుండా వారి యొక్క ఆర్థిక వికాసానికి తోడ్పడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం జిల్లాలోని అర్హత కలిగిన క్రిస్టియన్ మైనార్టీస్ యువతి యువకులకు కింద ఉదహరించిన కోర్సు లలో ఉచితంగా శిక్షణ ఇవ్వబడుతుంది. అభ్యర్థులు తమ బయోడేటాను దరఖాస్తు రూపంలో తయారు చేసి క్రిస్టియన్ కుల ధృవీకరణ పత్రం, తెలుపు రేషన్ కార్డు నకలు, ఆదాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాలకు రూ. 1,50,000 వరకు పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000 లక్షలకు మించరాదు), అభ్యర్థి యొక్క ఆధార్ కార్డు, కోర్సుకు సరిపడ విద్యార్హతలు నకలు జతచేసి ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఆర్‌డిఓ ఆఫీసు ప్రక్కన కలెక్టర్ ఆఫీసు, మహారాణిపేట విశాఖపట్నం 530002, ఫోన్: 0891-250221 ఫిబ్రవరి 10వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటల లోపు పంపాలన్నారు.

పేద విద్యార్థులకు హెచ్‌పీసీఎల్ చేయూతనిస్తుంది

గాజువాక, న్యూస్‌లీడర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల ఉన్నతికి హెచ్‌పీసీఎల్ చేయూతనిస్తుందని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ సీఎస్ఆర్ హెడ్ పి.ఎస్.ఎస్ రవీంద్రనాథ్ అన్నారు. హెచ్‌సీఎల్ సౌజన్యంతో ఎన్ఐఐటీ కంప్యూటర్ శిక్షణ పొందిన అగనంపూడి జెడ్‌పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రవీంద్రనాథ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ సంస్థ 2014 నుండి పేద విద్యార్థులకు కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఇంపోర్టింగ్ డిజిటల్ లిటరసీ నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో 40 ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 8000 మంది విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఈగల చిన రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఐఐటీ ప్రతినిధి ఎం. వికాస్, ఈడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, హెచ్ఎం కె. శ్రీనివాసరావు, హెచ్‌పీసీఎల్ సీనియర్ మేనేజర్ కె.వి.ఆర్ నగేష్, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు దాసరి సత్యవేణి, నెల్లి శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

సంస్థ సేవలకు సానుకూలత
తేరాపద్ పై ప్రశంసలు

విజయనగరం, న్యూస్‌లీడర్: గత 35 ఏళ్ళుగా వివిధ రంగాల్లో అనేక సేవలందిస్తున్న అఖిల భారత తేరాపద్ మహిళా మండలి (విజయనగరం) సేవలను భారత తేరాపన్ ప్రశంసించింది. జిల్లాలో లనేక మంది విద్యార్థులకు, బధిరులకు వారు చేస్తున్న సేవలను బుధవారం ప్రత్యక్షంగా పరిశీలిం చింది. అనంతరం రుక్మిణీ సదన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో అఖిల భారత మండలి కార్యదర్శి నీలం సెధీహై మాట్లాడుతూ జిల్లాలో గజపతినగరం సమీపానగల గుంకలాం గ్రామంలో ఉన్న పాఠశాలను దత్తత తీసుకుని అక్కడ విద్యర్థులకు కాలవసిన వసతులు, తదిత సౌకర్యాలు సమకూర్చటంలో మండలి చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. జిల్లాలో 57 ప్రాజక్టులను చేపట్టి వాటితో పాటుగా స్వచ్ఛభారత్ తదితర అంశాలపై కూడా దృష్టి పెట్టి వాటిని విజయవంతంగా పూర్తిచేటం మండలి తీసుకున్న చొరవకు నిదర్శనమని తెలిపారు. రానున్న రోజుల్ల ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని జిల్లా అధ్యక్షురాలు కుసుం సజ్జర్ తెలిపారు. ఈ కార్యకమంలో అఖిలభారత మండలి కమిటీ సభ్యులు ప్రభా దుగర్, సలహాదారులు సరోజ బందారి, జిల్లా అధ్యక్షురాలు కుసుం సజ్జర్‌లతో పాటు అఖిల భారత మండలి, రాష్ట్రమండలి సభ్యులు తదితర గౌరవ అతిథులు పాల్గొన్నారు.

2, 3 తేదీలలో క్రీడాకారుల ఎంపిక

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: క్రీడల పట్ల ఆసక్తి గల బాల బాలికలకు 2018-19 సంవత్సరంనకు స్పోర్ట్స్ అకాడమీలలో శిక్షణ కోసం ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాలియెట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి లలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికలు ఫిబ్రవరి 2, 3 తేదీలలో విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శని స్టేడియం నందు ఆర్చరీ, రైఫిల్ షూటింగ్, సైక్లింగ్, బాక్సింగ్, బాడ్మింటన్, జూడో, తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, అథ్లటిక్స్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. టీమ్ క్రీడలకు సంబంధించి బాస్కెట్ బాల్,ఫుట్ బాల్, హెండ్ బాల్, వాలీబాల్, ఖోఖో, కబాడీ విభాగాల్లో ఎంపిక జరుగుతుందన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు, విద్యార్థులు, 2018 మే నెలాఖరుకు 12 సం .ల నుండి18 సం .ల మధ్య వయస్సు కలిగి వుండాలన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే వారు పుట్టిన తేదీ ధృవపత్రం, టి.సి, లేదా మార్క్స్ మెమో, క్రీడా నైపుణ్య ధృవపత్రం, ఆధార్ కార్డు, స్టడీ, కాండాక్ట్ ధృవపత్రాలు, కుల, ఆదాయ ధృవపత్రాలు, 10 పాస్ పోర్టు సైజు ఫొటోలను సమర్పించవలసి వుంటుందన్నారు.



ఉత్తరాంధ్ర సమస్యలపై రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి , డాక్టర్ కేవీపీ . రామచంద్రరావు, అరకు పార్లమెంట్ సభ్యురాలు గీత, రాజమండ్రి మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులకు వినతి పత్రాలు అందజేస్తున్న ఉత్తరాంధ్ర చర్చావేదిక సభ్యులు .
- న్యూస్‌లీడర్, విశాఖపట్నం.

ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషన్ ఎగ్జిబిషన్ ప్రారంభం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : ఫార్ఛ్యూన్ ఇన్ శ్రీకన్య హోటల్లో నెప్ట్యూన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషన్ ఎగ్జిబిషన్‌ను ఆస్ట్రేలియ యూనివర్సిటీస్ ప్రతినిధి ప్రారంభించారు. అనంతరం నెప్ట్యూన్ సౌత్ సెంట్రల్ హెడ్ బి.సతీష్ మాట్లాడుతు ఆస్ట్రేలియాలో అన్ని ప్రముఖ విశ్వవిద్యాలయాలు అన్నిటినీ మన విశాఖలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ద్వారా విదేశాలలో చదువుకోవాలి అనుకునే విద్యార్థులకు,వాళ్ళ తల్లిదండ్రులకు ఈ ఎగ్జిబిషన్ సువర్ణవకాశం లాంటిదని తెలిపారు. ఈ అవకాశం. ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు నెప్ట్యూన్ వైజగ్ బ్రాంచి మేనేజర్ మాట్లడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో హాజరుకాని వారు కూడా వివరాలు తెలుసుకోవలంటే ద్వారాకనగర్ 1వ లైనులో వున్న నెప్ట్యూన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ ఆఫీస్‌లో సంప్రదించగలరు. మరిన్ని వివరాల కోసం 9000378659, 9295058222 సంప్రదించ వచ్చన్నారు.

కుష్టు వ్యాధి నివారణే ధ్యేయం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, వైద్య సిబ్బంది

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ : కుష్టు రహిత సమాజాన్ని రూపొందింటమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మండలంలో గల హరిశ్చంద్రపురం సర్పంచ్ పూజారి శైలజ సత్యనారాయణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధ్వర్యంలో నిర్వహించిన స్పర్శ అవగాహన కార్యక్రమంలో అమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కుష్టు వ్యాధిని లేకుండా చేయటమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని దీనిని ప్రజలు గుర్తించి నివారణ చర్యలు పాటించాలని ప్రజలకు అవగాహ కల్పించారు. ఈ కార్యక్రమంలో తిలారు. కొత్తపల్లి పిహెచ్‌సీ వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గిరిబాబు

టెక్కలి, న్యూస్‌లీడర్ : పాతపట్నం నియోజకవర్గం మెళియపుట్టి మండలం హిరపురం గ్రామానికి చెందిన రట్టి స్వాతి (24) గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక సహాయం కోసం దాతలను ఆశ్రయించింది. అందుకు టెక్కలి చెందిన ఎన్ఆర్ఐ ధవళ వెంకట గిరిబాబు స్పందించి. రూ.22000లు ఆర్థిక సాయం అందిచారు,ఈ ఈకార్యక్రమంలో,టెక్కలి నియోజకవర్గం. జనసేన పార్టీ సేవదళ్ సభ్యుడు కూరకుల యాదవ్,నరసన్నపేట నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు లుకలపు రంజిత్ కుమార్..అడ్వొకేట్ ఉప్పాడా నారాయణ రావు..చింతాడ శ్రీను, పాల తీర్థపు పూర్ణ, తోట హరీష్, దుక్క నరేష్,.పాల్గొన్నారు.

ఎట్టకేలకు యలమంచిలి రోడ్డు పనులు ప్రారంభం



యలమంచిలి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న లీలామోహన్

కోటబొమ్మాళి, న్యూస్‌లీడర్ : సుమారు మూడున్నర దశాబ్దాలు పాటు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న యలమంచిలి పంచాయతీ ప్రజలకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. నెల రోజుల క్రితం రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు యలమంచిలిలో పర్యటించి గంగరాం నుంచి యలమంచిలి వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 1.50 లక్షలు వ్యయంతో శంకుస్థాపన చేశారు. దీంతో ఈ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని మంత్రి కోరడంతో సంబంధింత కాంట్రాక్టర్ సిహెచ్‌వి. కృష్ణరెడ్డి, మాజీ సర్పంచ్ రోణంకి లీలామోహన్ అధ్వర్యంలో రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కవిటి రామయ్య, గ్రామప్రజలు తదితరులు ఉన్నారు.

11 దేశాలపై నిషేధం విధించిన ట్రంప్



ఇరాన్, ఇరాక్, లిబియా, ఈజిప్టు, మాలి, సోమాలియా, దక్షిణ సూడాన్, సుడాన్, సిరియా, యెమెన్ తో పాటు ఉత్తరకొరియాను అత్యంత ప్రమాదకర దేశాలుగా అభివర్ణిస్తూ.. ఆయా దేశాల నుంచి వచ్చే శరణార్థులపై నిషేధం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయాన్ని న్యాయస్థానాలు తీవ్రంగా తప్పుబట్టడంతో అమెరికా పట్టు సడలించింది. ఈ పదకొండు దేశాలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. నిషేధం ఎత్తివేస్తున్నా వారిపై కఠిన నిబంధనలు మాత్రం కొనసాగుతాయని చెప్పింది.

దీంతో ఈ దేశాల నుంచి వచ్చే శరణార్థులు గతంలో కన్నా కఠినతరమైన తనిఖీలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హోమ్ లాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్ట్ జెన్ నిల్సన్ తెలిపారు. ఇతర మతాలను లక్ష్యం చేసుకుని తామీ నిర్ణయం తీసుకోలేదని, దేశ రక్షణలో భాగంగా పలు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. అమెరికాకు ఎలాంటి వారు వస్తున్నారనేది తెలుసుకోవడం తమకు అత్యంత ప్రధానమైన అంశంగా ఉందని ఆయన తెలిపారు. అందుకే వలస జీవులు గతంలో కంటే కఠిన నిబంధనలు ఎదుర్కోనున్నారని ఆయన చెప్పారు.

కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి

విధుల్లోకి 7,500 మంది
మిగిలినవారు మార్చి ఒకటి నుంచి..
741 మంది మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్



హైదరాబాద్:

యువరక్తంతో పోలీస్‌శాఖలో నయా జోష్ వచ్చింది. ఇప్పుడున్న సిబ్బందికి తోడుగా 8,824 మంది కొత్త కానిస్టేబుళ్లు త్వరలో విధుల్లో చేరనున్నారు. వీరిలో 7,500 మంది గురువారం నుంచి విధులు ప్రారంభిస్తారు. మిగిలిన వారు మార్చి ఒకటిన విధుల్లో చేరనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శిక్షణ కేంద్రాల్లో వీరంతా ఇప్పటికే విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని పాసింగ్‌ఔట్ పరేడ్లలో పాల్గొన్నారు. మూడురోజులుగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీరిలో 741 మంది మహిళా కానిస్టేబుళ్లు బుధవారం పాసింగ్‌ఔట్ పరేడ్‌కు హాజరవుతారు. ఒక్కసారిగా ఇంతపెద్ద సంఖ్యలో కొత్త కానిస్టేబుళ్ల రాక పోలీస్‌శాఖలో నూతనోత్సాహం నిండింది. తెలంగాణ రాష్ట్రం అవతరించిన వెంటనే సీఎం కేసీఆర్‌పోలీస్‌శాఖను పటిష్ఠంచేయడంపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.

. గతేడాదిలో వివిధ విభాగాల్లో కలిపి ఒకేసారి 9,226 కానిస్టేబుళ్ల భర్తీకి పోలీస్‌శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారిలో అరత పరీక్షల అనంతరం 9091 మంది శిక్షణకు రిపోర్ట్ చేశారు. అందులో 384 మంది అభ్యర్థులు శిక్షణ మధ్యలోనే ఇతర ఉద్యోగాలకు వెళ్లారు. తర్వాత మరికొన్ని కారణాలతో మరికొందరు తప్పుకోగా 8824 మంది కానిస్టేబుళ్లు శిక్షణకు హాజరయ్యారు. వీరిలో 2240 మంది సివిల్‌కానిస్టేబుల్, 2700 మంది ఏఆర్ కానిస్టేబుల్, 3574 మంది టీఎస్-ఎస్పీ విభాగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర పోలీస్‌శాఖలో తొలిసారిగా ఒకే విడుతలో 741 మంది మహిళా కానిస్టేబుళ్లు విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకుని విధుల్లో చేరబోతున్నారు. బుధవారం రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగే పాసింగ్‌ఔట్ పరేడ్‌లో వీరు పాల్గొన్నారు.

ఐదేళ్లకు పైబడిన ఖాళీలు రద్దు!



న్యూఢిల్లీ:

ఐదేళ్లకు పైగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను రద్దు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తమ విభాగాల్లో భర్తీచేయని ఉద్యోగాలకు సంబంధించి సమగ్ర నివేదికలు సమర్పించాలని అన్ని మంత్రిత్వ శాఖలను ఆదేశించింది. ఐదేళ్లకు పైగా ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి, వాటి రద్దుకు తీసుకున్న చర్యలు వివరిస్తూ నివేదికలు ఇవ్వాలని పలు విభాగాల ఉమ్మడి కార్యదర్శులకు ఆర్థిక శాఖ జనవరి 16న మెమొరాండం పంపింది. ఈ మేరకు కొన్ని శాఖలు, విభాగాలు ఇప్పటికే నివేదికలు సమర్పించగా, మరికొన్ని కొంత సమాచారం మాత్రమే అందించాయి. ఆ తరువాత హోం మంత్రిత్వ శాఖ కూడా తన పరిధిలోని అదనపు కార్యదర్శులు, ఉమ్మడి కార్యదర్శులతో పాటు పారా మిలటరీ బలగాల చీఫ్‌లు, ఇతర అనుబంధ సంస్థలకు ఇలాంటి ఆదేశాలే జారీచేస్తూ నివేదికలు కోరిందని ఆ శాఖ అధికారి ఒకరు వెల్లడించారు.

మరికొద్ది రోజుల్లో శిక్ష.. ఉరేసుకొని నటుడు మృతి



న్యూయార్క్ :

లైంగిక వేధింపులు, చైల్డ్ పోర్నో గ్రఫీ ఆరోపణలు ఎదుర్కొంటున్న అమెరికన్ నటుడు మార్క్ సాలింగ్ (35) చనిపోయాడు. తన నివా సంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని అతడి తరుపు న్యాయవాది మైఖేల్ ప్రోక్టార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయాన్నే అతడు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు చ్పారు. గ్లీ వంటి టీవీ సిరీస్‌లలో మంచి నటుడిగా అతడికి పేరుంది. అయితే, 2015లో అతడిపై లైంగిక వేధింపులు, చైల్డ్ పోర్నోగ్రఫీ ఆరోపణలు వచ్చాయి.

దీంతో అతడిని అరెస్టు చేసిన పోలీసులు 2016లో చార్జిషీట్ ఫైల్ చేశారు. అతడి ల్యాప్‌టాప్‌ను స్వాధీనంలోకి తీసుకొని పరిశీలించగా అందులో దాదాపు 50 వేల చైల్డ్ పోర్నోగ్రఫిక్ ఫొటోలు, వీడియోలు లభించాయి. ఈ మేరకు వాదోపవాదాలు పరిశీలించి అతడు దోషి అని న్యాయమూర్తి నిర్ధారించారు. ఈ వచ్చే మార్చి 7న అతడికి శిక్ష ఖరారు కానుంది. ఈ లోగానే అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత ఆగస్టులో (2017)లో కూడా ఓసారి ఆత్మహత్యాయత్నానికి సాలింగ్ పాల్పడినట్లు తెలిసింది.

2019లో వార్ వన్‌సైడే: కవిత



హైదరాబాద్:

పలువురు కాంగ్రెస్ నేతలు తెరాసలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని నిజామాబాద్ ఎంపీ, సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచి పోటీ చేసేది పార్టీయే నిర్ణయిస్తుందని చెప్పారు. 2019 ఎన్నికల్లో తెరాస 100 అసెంబ్లీ స్థానాల్లో గెలుస్తుందని అన్ని సర్వేలూ చెబుతున్నాయని కవిత అన్నారు. తెలంగాణ రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం రాజకీయ పార్టీ పెడితే స్వాగతిస్తామన్నారు. మంగళవారం ఆమె మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. వలసల వల్ల వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. బంగారు తెలంగాణ దిశగా ముందడుగు వేసినట్లు చెప్పారు. మరికొన్ని నూతన కార్యక్రమాలను తీసుకొచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ వారసులు ఎవరనేది భవిష్యత్తే నిర్ణయిస్తుందన్నారు. మహిళల కోసం తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోందని, రాష్ట్రానికి చెందిన ఒక్కరికైనా పద్మ అవార్డులు రాకపోవడం బాధాకరమన్నారు.

కాళేశ్వరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని అడిగినట్లు చెప్పారు. రాష్ట్రానికి ఇంకా కేంద్రం చేయాల్సింది చాలా ఉందన్నారు. పార్లమెంట్ వేదికగా తెలంగాణ వాణిని బలంగా వినిపిస్తామన్నారు. పసుపు బోర్డు విషయమై కేంద్రంలో కదలిక తీసుకొచ్చినట్లు చెప్పారు. సింగరేణి వారసత్వ ఉద్యోగాల ముసాయిదాను ఏసీ సైతం ఆమోదించారని, విధాన రూపకల్పన తర్వాత సీఎం కేసీఆర్ సింగరేణియాత్ర ఉంటుందని కవిత స్పష్టంచేశారు.

నవయుగకు పోలవరం టెండర్లు..!



పోలవరం ప్రాజెక్టుపై ఢిల్లీలోని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో తాజాగా కీలక భేటీ ముగిసింది. ప్రాజెక్టులో స్పిల్‌వే కాంక్రీటు, స్పిల్ ఛానల్ పనులను కొత్త గుత్తేదారుకు అప్పగించే అంశంపై ఈ సమావేశంలో ఓ స్పష్టత వచ్చింది. దీనిపై రెండు గంటలపాటు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ, జలసంఘం అధికారులతో భేటీ తర్వాత మంత్రి గుత్తేదార్లతో కాసేపు సమావేశమయ్యారు.

కాగా ఈ సమావేశంలో నవయుగ, ట్రాన్స్‌ట్రాయ్ గుత్తేదారు సంస్థల్లో వేటికి ఈ పనులు అప్పగించే అంశంపై చర్చించారు. పోలవరం ప్రధాన గుత్తేదారుగా ఉన్న ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ ఇప్పటివరకు అనుకున్నవిధంగా నిర్దిష్ట సమయంలో పనులు పూర్తిచేయని కారణంగా ఈ పనులను నవయుగకు అప్పగించాలని నిర్ణయించారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ 2019 నాటికి పాత ధరలతోనే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసేందుకు నవయుగతో అంగీకారం కుదుర్చుకున్నట్లు తెలుస్తుంది. నవయుగ కంపెనీకి స్పిల్‌వే, ఛానల్ పనుల్ని పూర్తిచేసేందుకు నిర్దేశిత గడువును ఇవ్వడంతో పాటు అధికారిక కార్యక్రమాలు పూర్తి చేసుకొనేందుకు అవగాహన ఒప్పందం కూడా కుదరనుంది. దీనిప్రకారం స్పిల్‌వే, స్పిల్‌ఛానల్ పనుల్ని నవయుగ సంస్థ వారం రోజుల తర్వాత చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం అందుతుంది.


ప్రపంచ సుందరి కలలకు తొలి మెట్టు



బెంగళూరు:

భారతదేశానికి 17ఏళ్ల తర్వాత ప్రపంచ సుందరి కిరీటాన్ని తెచ్చిన మానుషి చిల్లర్‌లా వెలగాలని ఆశించే యువతులు ఎందరో... వారి కలలను సాకారం చేసేందుకు తొలిమెట్టుగా భావించే ఎఫ్‌బీబీ ఫెమినా మిస్ ఇండియా ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 9నుంచి ప్రారంభమయ్యే ఈ ఎంపిక ప్రక్రియను బెంగళూరులో ఈనెల 18న నిర్వహిస్తారు. ప్రపంచ సుందరి నీలి కిరీటాన్ని మళ్లీ భారత్ ముంగిట ఉంచాలనుకునే వారికి నేహా ధూపియా, పూజా చోప్రా, పూజా హెగ్డే, రకుల్ ప్రీత్‌సింగ్ వంటి వారు శిక్షణ ఇవ్వనున్నారు. దిల్లీతో సహా దేశ వ్యాప్తంగా 30రాష్ట్రాల్లో నిర్వహించే ఈ ఎంపిక ప్రక్రియలో అరత పొందిన వారు భారతదేశం తరఫున ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటారు. మొత్తం రాష్ట్రాల నుంచి ఎంపికైన వారికి బెంగళూరు, కోల్‌కతా, దిల్లీ, ముంబయి వంటి వలయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. బెంగళూరులో 18, 24తేదీల్లో దక్షిణ వలయ స్థాయి ఎంపిక జరుగుతుంది. అనంతరం వివిధ వలయాల్లో గెలుపొందిన వారికి మే 13న ముంబయిలో అంతిమ పోటీలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

అది లీక్ బడ్జెట్...ఇది బ్లాక్ బడ్జెట్



విశాఖపట్నం,న్యూస్‌లీడర్:

భారతదేశ బడ్జెట్‌లో ఎన్నటికీ చర్చగా మిగిలిపోయే రెండు బడ్జెట్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. గురువారం నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటిని గురించిన పోస్టింగులు ఒకటికి పదిమార్లు దర్శనమిస్తున్నాయి. వాటిలో ఒకటి 1950సంవత్సరం బడ్జెట్. అప్పట్లో బడ్జెట్ ప్రతులు రాష్ట్రపతి భవన్‌లో ముద్రింపబడేవి. అయితే ఆ ఏడాది బడ్జెట్ పత్రాలు లీక్ అయిన తరుణంలో ఆ తర్వాత ముద్రణను ఢిల్లీ మింటో రోడ్డులో గల ప్రభుత్వ ప్రెస్‌కు తరలించారు. 1980సంవత్సరంలో పార్లమెంట్‌లోని నార్త్‌బ్లాక్‌ను బడ్జెట్ ప్రతుల ప్రింటింగ్ కోసం కేటాయించారు. ఇకపోతే రెండోది 1973వ సంవత్సరం బడ్జెట్. ఆ ఏడాది దేశ బడ్జెట్ ఫిబ్రవరి 28న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ ఆర్థిక మంత్రి యశ్వంత్‌రావ్ చవాన్ రూ. 550కోట్ల లోటుతో బడ్జెట్ ప్రవేశపెట్టారుఅ.ందుకే దానిని బ్లాక్ బడ్జెట్‌గా పేర్కొన్నారు. ఇకపోతే 1997సంవత్సరంలో ఆర్థిక మంత్రిగా ఉన్న చిదంబరం ప్రవేశ పెట్టిన బడ్జెట్ డ్రీమ్ బడ్జెట్‌గా పేరుగాంచింది.

ఐపీఎల్.. క్రికెట్ కోసమా? బెట్టింగుల కోసమా?

బాంబే హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు



ముంబై:

ఐపీఎల్ పుణ్యమాని ఫిక్సింగ్, బెట్టింగ్‌లు బాగా ప్రాచుర్యం పొందాయని, మరి ఈ లీగ్‌తో క్రికెట్ ఆటకు ఒనగూరిన ప్రయోజనమేంటో చూడాలని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోడీపై నమోదైన విదేశీ మారక నిల్వల (ఫెమా) కేసు విచారణ సందర్భంగా డివిజన్ బెంచ్‌లోని న్యాయ మూర్తులు జస్టిస్ ధర్మాధికారి, భారతి డంగ్రే వ్యాఖ్యా నిస్తూ 'ఐపీఎల్‌ను విజయవంతం చేశారు సరే. గడిచిన పదేళ్లలో ఆర్థిక అవకతవకలు, కేసుల కంటే ఈ లీగ్ ఆటకెంత మేలు చేసిందో నిర్వాహకులు సమీక్షించుకోవాలి.

ఇప్పటికే ఫిక్సింగ్- బెట్టింగ్‌లతో ఐపీఎల్ బాగా పాపులర్ అయింది. ఈ నేపథ్యంలో కేంద్రం, రిజర్వ్ బ్యాంక్, ఐపీఎల్ నిర్వాహకులు ఈ లీగ్ క్రికెట్ క్రీడ కోసమా లేదా అనేది తెలుసుకోవాల్సిన అవసరం వచ్చింది' అని అన్నారు. లలిత్ మోడీపై నమోదైన కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను తమ మార్గదర్శనంలో చేయాలని ఈడీని ఆదేశించింది. మార్చి 2న మొదలయ్యే ఈ ప్రక్రియను 31లోగా పూర్తి చేయాలని డివిజన్ బెంచ్ ఆదేశించింది.

బౌలర్లను ఆటాడుకున్న తనిష్క్

149 ఫోర్లు, 67 సిక్సర్లు
ఒక్కడే వెయ్యి పరుగులు చేసిన వైనం



అధికారక మ్యాచ్ కాకపోవడంతో ప్రపంచ రికార్డు మిస్ ఇది కనుక అధికారిక మ్యాచ్ అయి ఉంటే 13 ఏళ్ల తనిష్క్ గవాటే పేరిట ప్రపంచ రికార్డు నమోదై ఉండేది. అండర్-14 ముంబై షీల్డ్ ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కోపార్ కహిరానె- నవీ ముంబై జట్ల మధ్య మంగళవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో తనిష్క్ అద్భుత ఆటతీరుతో అదరగొట్టాడు. ఆకాశమే హద్దుగా చెలరేగి ఏకంగా 1,045 పరుగులు చేశాడు. రెండేళ్ల క్రితం భండారీ కప్ ఇంటర్-స్కూల్ టోర్నమెంట్‌లో భాగంగా ప్రణవ్ ధనవాడే 1,009 పరుగులు చేశాడు. ఇప్పుడా రికార్డును తనిష్క్ తిరగరాశాడు. 1009 పరుగులు చేసిన ధనవాడే స్కూల్ క్రికెట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. 1899లో ఆర్థర్ కోలిన్స్ చేసిన 628 పరుగుల రికార్డును తుడిచిపెట్టేశాడు. యశ్వంత్ రావ్ చవాన్ ఎలెవన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తనిష్క్ తాజాగా 515 బంతుల్లో 149 ఫోర్లు, 67 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించాడు. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో తనిష్క్ అజేయంగా 316 పరుగులు చేయడం విశేషం. అతడి బ్యాటింగ్ శైలిని, ఎనర్జీని చూసిన క్రీడా పండితులు ఆశ్చర్యపోతున్నారు. తనిష్క్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఫేస్ బుక్ ప్రధాన కార్యాలయంలో మంత్రి లోకేష్



అమెరికా :

అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ ఫేస్ బుక్ కంపెనీని సందర్శించారు. ఫేస్ బుక్ 10 ఎకరాల ప్రధాన కార్యాలయంపై నిర్మించిన అతి పెద్ద రూఫ్ గార్డెన్‌ను మంత్రి నారా లోకేష్‌కు ఫేస్ బుక్ ప్రతినిధులు చూపించారు. అక్కడ జరుగుతున్న పరిశోధన, అభివృద్ధి,అధునాతన ఉత్పతులు,అధునాతన టెక్నాలజీల గురించి లోకేష్‌కు ఫేస్ బుక్ సిబ్బంది వివరించింది. ఫేస్ బుక్ స్పేసేస్, వర్చ్యువల్ రియాలిటీ కాన్సెప్ట్‌ను మంత్రి నారా లోకేష్‌కు తెలియజేసింది. సోలార్ ఎయిర్ క్రాఫ్ట్ (అక్విలా) ద్వారా మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందించడం, ఫిక్స్ వైర్ లెస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా పట్టణాల్లో ఇంటర్నెట్ సేవలు విస్తృతపరచడం, మొబైల్ కనెక్టివిటీ కోసం టెలికాం ఇన్ఫ్రాప్రాజెక్ట్, ఎక్స్ ప్రెస్ వైఫై ద్వారా గ్రామాల్లో వేగమైన వైఫై సేవలు అందించే టెక్నాలజీల గురించి మంత్రి నారా లోకేష్‌కు

ఏపీతో కలిసి పనిచేస్తాం: ఫేస్‌బుక్ ప్రతినిధులు

ఫేస్ బుక్ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఇంటర్నెట్ ప్రజలకు ప్రాథమిక హక్కు గా మారబోతుందన్నారు. స్టార్ట్ అప్ రాష్ట్రంగా ప్రయాణం ప్రారంభించామని రాష్ట్ర ప్రయాణం మొదలు అయ్యినప్పుడు అంతగా ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేవని ఇప్పుడు ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ఫైబర్ గ్రిడ్ ద్వారా 149 రూపాయిలకు ఇంటర్నెట్, వైఫై, టెలివిజన్ అందిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్‌లో ఫేస్ బుక్ మరింతగా విస్తరించేందుకు ఫైబర్ గ్రిడ్ ఉపయోగపడుతుందన్నారు. నూతన టెక్నాలజీలు అన్ని ఆంధ్రప్రదేశ్ లో పైలెట్ ప్రాజెక్ట్ చెయ్యండంటూ లోకేష్ కోరారు. ఫైబర్ నెట్ ద్వారా గ్రామాల్లోని ఇళ్లల్లో తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు. దీనికి ఫేస్ బుక్ సహకారం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తో కలిసి పనిచేస్తామని మంత్రి లోకేష్‌కు ఫేస్ బుక్ ప్రతినిధులు స్పష్టం చేశారు. తాము అభివృద్ధి చేస్తున్న టెక్నాలజీలు అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌లో పైలెట్ ప్రాజెక్ట్ చేస్తామన్నారు.



బాబు సైకిల్ సవారి



అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం వెలగపూడి సచివాలయంలో స్మార్ట్ సైక్లింగ్ వ్యవస్థను ప్రారంభించారు. సైకిల్ పార్కింగ్ నుంచి తన కార్యాలయం ఉన్న బ్లాక్ 1 వరకు సైకిల్ మీద ముఖ్యమంత్రి వచ్చారు. సైకిళ్ల తయారీ కేంద్రాన్ని ఏపీలోనే ఏర్పాటుచేయాలని సీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. సైకిల్ పార్కింగ్ ఏరియాలలో ఏసీ, సోలార్ ప్యానెల్, కుర్చీలు ఏర్పాటు చేయాలని, దగ్గరలో గార్డెనింగ్ ఏర్పాటుచేసి సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. తొలిసారిగా వెలగపూడి సచివాలయంలో ప్రయోగాత్మకంగా అమలుచేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం సీఆర్‌డీఏ పరిధిలో సైకిల్ సవారీకి ప్రత్యేకంగా ట్రాక్‌ల ఏర్పాటుచేశారు. కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా స్మార్ట్ సైకిళ్ల వ్యవస్థ రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

బుధవారం నుంచి...

సచివాలయంలో సందర్శకులకు సచివాలయం స్మార్ట్ సైకిళ్లు అందుబాటులోకి వచ్చాయి. సచివాలయం లోపల, బయట సందర్శకుల అవసరార్థం సైకిళ్లు తిరగనున్నాయి. జర్మనీ నుంచి ఇప్పటికే సచివాలయంలో 30 సైకిళ్లు ఉన్నాయి. సచివాలయం ఆవరణ లోపల రెండు స్మార్ట్ సైకిల్ స్టేషన్ల ఏర్పాటుచేశారు. సచివాలయం వాహనాల పార్కింగ్ వద్ద మరో స్టేషన్ ఏర్పాటుచేశారు. ప్రతి స్టేషన్‌లో అందుబాటులో 10 సైకిళ్లు సైకిల్ తీసుకునే వారికి ప్రత్యేకంగా స్వైపింగ్ కార్డు, పాస్‌వర్డ్‌తో సైకిళ్లు తెరుచుకుంటాయి. పని ముగించుకున్న తర్వాత తీసుకున్న సైకిల్‌ను మూడు స్టేషన్లలో ఎక్కడైనా అప్పజెప్పి వెళ్ళే అవకాశం ఉంది. ఎల్లాయిడ్, అల్యూమినియంతో తయారు చేయబడిన ఈ కొత్త సైకిళ్లు. వర్షంలో తడిసినా తుప్పు పట్టే అవకాశం లేని మూడు గేర్ల సైకిళ్లు ఇవి.

గూడ్స్ రైలుకు తప్పిన ప్రమాదం

విశాఖపట్నం,న్యూస్‌లీడర్:

ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలోని కలికోట్-చిలికోట్ రైల్వే స్టేషన్ల మధ్యలో విశాఖ వస్తున్న ఒక గూడ్స్ రైలుకు పెద్ద ప్రమాదం తప్పింది. గేట్‌మెన్, లోకోపైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ జాగ్రత్త, సత్వర చర్యల వలనే ఇది సాధ్య పడింది. రౌల్‌కెల దగ్గరలోని బిరమిత్రాపూర్ నుంచి బయల్దేరిన ఆ గూడ్సు రైలు విశాఖ ఉక్కు కర్మాగారానికి డోలమైట్ లోడు తీసుకొస్తోంది. అయితే చిలికా సమీపంలోనికి వచ్చే సరికి పట్టాల పటిష్టత లోపించింది. దీనిని అక్కడ గేట్‌మెన్‌గా ఉన్న బి.కె.శెట్టి గుర్తించి రైలు డ్రైవర్‌ను అప్రమత్తం చేశాడు. దాంతో డ్రైవర్ ఎస్.ఎస్.పట్నాయక్, అసిస్టెంట్ డ్రైవర్ ఎస్.కె.సాహూ వెంటనే అప్రమత్తమై వ్యాగన్ చక్రాలన్నీ ఒకేసారి నిలిచిపోయేలా చర్యలు తీసుకున్నారు. దాంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రస్తుతం ఖుర్దారోడ్ రైల్వే డివిజన్ సిబ్బంది ట్రాక్ మరమ్మతు పనులు చేపడుతున్నారు.

డౌన్ ట్రాక్ క్లియర్‌గానే ఉంది. ప్రస్తుతం ఒకే లైన్ వినియోగంలో ఉన్నందున విశాఖపట్నం-భువనేశ్వర్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం బరంపూర్ వరకే నడుస్తోంది.అలాగే డౌన్‌రూట్‌లో కూడా బరంపూర్ నుంచే ఆ రైలు బయల్దేరుతోంది. ట్రాక్ మరమ్మతులు పూర్తయ్యే వరకు ఈ సేవలు ఇలానే కొనసాగుతాయి.

సంచలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం
గురువారం 1-2-2018

జక్కన్న ఫ్లాప్ సెంటిమెంట్ కు బ్రేక్

రాజమౌళి సినిమాలతో హీరోలు అందరికీ భారీ సక్సెస్ అందుతుంది. కానీ ఆ తర్వాత పరిస్థితే దారుణంగా ఉంటుంది. రాజమౌళితో సినిమా చేసిన ఎవరూ.. ఆ తర్వాత సక్సెస్ కొట్టలేకపోయారు. అదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులను కాసింత భయపెడుతోంది. సై చిత్రంతో బ్లాక్ బస్టర్ కొట్టిన తర్వాత.. ఏళ్ల తరబడి సక్సెస్ కోసం తిప్పలు పడ్డాడు నితిన్. సింహాద్రి తర్వాత హిట్ కొట్టేందుకు ఎన్టీఆర్ చాలానే తిప్పలు పడి.. చివరకు మళ్లీ యమదొంగ అంటూ జక్కన్నే తీసేవరకూ వెయిట్ చేయాల్సి వచ్చింది. రవితేజకు విక్రమార్కుడు తర్వాత ఖతర్నాక్ అంటూ ఫ్లాప్ ఎదురైంది. సునీల్ తో మర్యాద రామన్న తీశాడు రాజమౌళి. ఆ తర్వాత హీరోగా మారిన సునీల్.. పూలరంగడు మినహాయిస్తే.. మరే చిత్రంతోనూ ఆకట్టుకోలేకపోయాడు. అలా రాజమౌళితో సినిమా అంటే చాలామందికి ఓ ఫ్లాప్ సెంటిమెంట్ పడిపోయింది.

మెడికల్ టూరిజంగా విశాఖ

ఒకే వేదికపై 2000మంది వైద్యులు

ఐఎసీటీఎస్ సీఓఎన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ రాజన్ సేతురత్నం



విశాఖసిటీ, న్యూస్‌లీడర్: మరో జాతీయసదస్సుకు విశాఖ వేదిక కాబోతోందని,. దేశ విదేశాలనుంచి 2000మంది వైద్యనిపుణులు సదస్సులో భాగస్వాములు కానున్నారని జాతీయ గుండె ఊపిరితిత్తుల శస్త్రచికిత్సా నిపుణుల అసోసియేషన్ జాతీయకార్యధర్శి డాక్టర్ రాజన్ సేతురత్నం తెలిపారు. స్థానికహెూటల్లో సిఎంఈ,యూరోపియన్ అసోసియేషన్ సంయుక్తంగా బుదవారం మీడియాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 64వ జాతీయ గుండె ఊరిపితిత్తుల శస్త్రచికిత్సా వార్షిక సదస్సును విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ పివి సత్యన్నారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 1వతేదీనుంచి 4వతేదీవరకూ నాలుగురోజులపాటు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి వైద్యశాఖామంత్రి కామినేని శ్రీనివాస్‌తో పాటు స్థానిక మంత్రులు అయ్యపాత్రుడు, గంటాశ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. రెండోరోజు ముఖ్యఅతిధిగా సద్గురు జగ్గివాసుదేవ్ పాల్గొని యోగా, హెల్దీలైఫ్ పై అవగాహన కలిగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిద దేశాల వైద్యులు వారి ఆలోచనలను, అనుభవాలను ఒకరితో ఇకరు పంచుకుంటారని దానిద్వారా త్వరితగతిన టెక్నాలజీని అందిపుచ్చుకునే వీలుంటుందన్నారు. అత్యాదునిక నైపుణ్యంతో శస్త్రచికిత్సలుచేసి రోగికి మెరుగైన వైద్యం అందించే వీలుంటుందన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కరుణాకర్ పాడీ మాట్లాడుతూ మొట్ట మొదటిసారిగా విశాఖలో ఇలాంటి అద్భుతమైన సదస్సు నిర్వహించుటకు అవకాశం దొరకడం అదృష్టంగా బావిస్తున్నామన్నారు. హార్టు,ట్రాన్స్‌ప్లెంట్, బైపాస్ సర్జరీలు చేయడంలో మెళుకువలు తెలుసుకునేందుకు వైద్యులకు మంచివేదిక అన్నారు.

ఇంగ్లాండ్,న్యూజిలాండ్,ఆస్ట్రేలియా,బంగ్లాదేశ్ వంటి దేశాలనుంచి 41మంది వక్తలు హాజరై ప్రసంగిస్తారన్నారు.నోవాటెల్ హెూటల్లో జరగబోయే వేదికను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంగ్లాండునుంచి సదస్సుకు హాజరవ్వడానికి వచ్చిన ముఖ్యఅతిధి డాక్టర్ రాబర్ట్ ఏండ్రోసన్ మాట్లాడుతూ తాను 1974 సంవత్సరం నుంచి వైద్యవృత్తిలో వున్నానని అప్పట్లో మూడుసంవత్సరాలు వయస్సువచ్చేవరకూ ఆపరేషన్లు చేసేవారంకాదని,ఇప్పుడు వారంరోజుల లోపు బిడ్డకు కూడా ఏదైనా సమస్యవస్తే శస్త్రచికిత్స చేసేంతగా వైద్యం ఆదునీకరణ అయిందన్నారు.తాను రెండోసారి భారతదేశంలో పర్యటిస్తున్నాని గతంలో కలకత్తా,ముంబై,డిల్లీ వంటి నగరాల్లో సందర్శించానని భారతదేశంలో కూడా అన్నిచోట్ల అత్యాదునిక వైద్యసేవలు పరికరాలు అందుబాటులో వున్నాయన్నారు.

ప్రేమ సమాజంలో అన్నదానం



స్వర్గీయ ఆళ్ళ రమాదేవి 13వ వర్ధంతి సందర్భంగా డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో రమాదేవి తండ్రి బుద్ధ శివాజీ పాల్గొన్నారు. సుమారు 15రకాల వంటకాలతో కార్యక్రమం నిర్వహించారు. రమాదేవి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని అందరూ నిర్వహించాలని ముఖ్య అతిథులుగా విచ్చేసిన వక్తలు కొనియాడారు.

- న్యూస్‌లీడర్, విశాఖపట్నం

శర్వా మెలిక పెట్టేశాడు



శర్వానంద్ ప్రస్తుతం చకచకా సినిమాలు చేసేస్తున్నాడు. ఏడాదికి మూడు సినిమాలను థియేటర్లలోకి తెచ్చేస్తోన్న ఊపులో ఉన్నాడు ఈ యంగ్ హీరో. గతేడాది శతమానం భవతి.. రాధ.. మహానుభావుడు అంటూ మూడు చిత్రాలను అందించిన ఈ హీరో.. ఈ ఏడాది కూడా అదే జోరు చూపించేందుకు రెడీగా ఉన్నాడు. ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్న శర్వా.. ఇప్పటికే ఓ షెడ్యూల్ కంప్లీట్ చేసేశాడు కూడా. మరోవైపు సుధీర్ వర్మ డైరెక్షన్ లో కూడా ఓ చిత్రం రూపొందుతోంది. ఈ రెండు సినిమాలను ఏకకాలంలో షూటింగ్ చేస్తూ ఫుల్ బిజీగా ఉన్న శర్వా.. మరోవైపు కొత్త కథలను కూడా చకచకా వినేస్తూ.. ప్రాజెక్టు దశకు తీసుకువచ్చేస్తున్నాడు. రీసెంట్ గా దండుపాళ్యం ఫేమ్ డైరెక్టర్ శ్రీనివాస రాజు.. శర్వానంద్ ను కలిసి ఓ కథ చెప్పాడు. ఇది కూడా సీరియస్ థీమ్ తో సాగే చిత్రమే అయినా.. దండుపాళ్యం మాదిరిగా ఉండదట. ఈ స్టోరీ ని శర్వా మెచ్చినా సరే.. కేవలం బేసిక్ లైన్ మాత్రమే కావడంతో.. ఓకే చెప్పలేకపోయాడట. అయితే ఈ సినిమా ఫిబ్రవరి నెలాఖరులో మెదలెడుతున్నాం అని న్యూస్ వచ్చింది కాని.. ఇప్పుడు దీనిపై ఒక క్లారిటీ వస్తోంది. బౌండ్ స్క్రిప్ట్ తను చదివితే మాత్రమే ఈ సినిమాపై డెసిషన్ తీసుకోగలనని.. ఈ కథను డెవలప్ చేసుకుని తీసుకురమ్మంటూ శ్రీనివాసరాజుకు మెలిక పెట్టాడట శర్వానంద్. ఇందుకోసం 3 నెలలకు పైగా టైం అడిగాడట ఆ దర్శకుడు. ప్రస్తుతం తను చేస్తున్న సినిమాలకు అంతకుమించి టైం పట్టనుండడంతో.. శర్వా కూడా ఓకే చెప్పేశాడట. మొత్తానికి ఓ కొత్త కాంబినేషన్ ను అంత ఈజీగా శర్వా ఒప్పుకోవట్లేదనమాట.

వరుణ్‌ని ఇంటికి పిలిచిన భామ



హిందీ సీరియల్స్‌తో పాటు.. బాలీవుడ్ మూవీ ఖామోషియాలో కనిపించిన బ్రిటన్ భామ సప్నా పబ్బి.. ఇప్పుడు వరుణ్ తేజ్ మూవీ తొలిప్రేమతో.. టాలీవుడ్‌లోకి తెలుగు అడుగులు వేస్తోంది. పలు కార్పొరేట్ కంపెనీల యాడ్స్ లో ఇప్పటికే దక్షిణాది జనాలకు కనిపించిన ఈ బ్యూటీ.. తొలిసారిగా ఓ సినిమా ద్వారా తెలుగులోకి వస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న తొలిప్రేమ చిత్రంలో.. ఓ స్పెషల్ సాంగ్ లో కనిపించనుంది సప్నా పబ్బి. స్పెషల్ అంటే.. అదేమీ ఐటెం సాంగ్ కాదు. సిట్యుయేషన్ ప్రకారం కుదిరిన ఓ సూపర్బ్ సాంగ్. సునోనా సునయనా అంటూ సాగే ఈ పాటకు.. ఇప్పటికే బోలెడంత క్రేజ్ వచ్చింది. ఓ టూరిస్ట్ గైడ్ గా తొలిప్రేమలో కనిపించనున్న ఈ బ్యూటీపై.. ఈ చక్కని పాటను చిత్రీకరించారట. లండన్ వీధుల్లో షూటింగ్ జరుపుకోగా.. ఈ పాట పిక్చరైజేషన్ కు నాలుగు రోజులు పట్టిందని అంటోంది సప్నా పబ్బి. లండన్ తమ ఊరే కావడంతో.. వరుణ్ తేజ్.. వెంకీ అట్లూరి ఇద్దరినీ ఆ నాలుగు రోజుల పాటు తమ ఇంటికి రావాలంటూ ఆహ్వానిస్తూనే ఉందట. అయితే షూటింగ్ బిజీ కారణంగా అసలు కుదరనే లేదని అంటోంది సప్నా పబ్బి. ఓ డిఫరెంట్ ప్రయత్నం చేద్దామనే ఉద్దేశ్యంతో తొలిప్రేమలో స్పెషల్ సాంగ్ కు యాక్సెప్ట్ చేశానని చెప్పిన ఈ బ్రిటిష్ బ్యూటీ.. తనకు పంజాబి హిందీ భాషలు అయితే కంఫర్ట్ గా ఉంటాయని.. తెలుగులో ఇప్పటి వరకూ 'నాకు అర్ధం కాలేదు' అన్న సెంటెన్స్ ఒక్కటే నేర్చుకున్నానని చెబుతోంది.



ఏపీ హామీల అమలుకు పార్లమెంటులో ఒత్తిడి తెస్తాం

మాజీప్రధాని మన్మోహన్ సింగ్

డిల్లీ, న్యూస్‌లీడర్: తాను ప్రధానిగా ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన ప్రత్యేకహెూధా, విశాఖరైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేకప్యాకేజ్, పోలవరం, అమరావతి నిర్మాణానికి ప్రత్యేకనిధులు తదితర విభజన హామీల అమలుకు బీజేపీ ప్రభుత్వపై పార్లమెంటులో ఒత్తిడి తేస్తామని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆద్వర్యంలో డిల్లీ వెళ్లిన ఉత్తరాంధ్రా చర్చావేదిక సభ్యులకు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ విభజనహామీలు అమలుజరగాలనే సంకల్పంతో రైలుయాత్ర గా డిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. దీనిలోభాగంగా బుదవారం డిల్లీలో మాజీప్రధాని మన్మోహన్ సింగ్‌ని కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై



స్పందించిన ఆయన మాట్లాడుతూ ఆంద్రప్రధేశ్ తనకు ఇష్టమైన రాష్ట్రమని, ఏపీకి ఉజ్వల భవిష్యత్తు వుందన్నారు.ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఏపీ ఆర్ధికరాజధాని గా ఎదుగుతున్న విశాఖను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. మాజీ ఎంపీలు కణితి విశ్వనాధం, జ్ఞానేంద్రరెడ్డి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీ, ఉత్తరాంధ్రా రక్షణా వేధిక అధ్యక్షుడు శివశంకర్ మాజీప్రధానిని కలిసిన వారిలో వున్నారు.



చరణ్ హ్యాండ్ ఇచ్చాడు

ఇటీవలే మొదలైన రామ్ చరణ్-బోయపాటి శీను సినిమా మొదటి షెడ్యూల్ పూర్తయ్యింది అనే వార్త వినగానే అందరూ షాక్. అదేంటి చెర్రి ఇంకా రంగస్థలం షూటింగ్ లో ఉండగా ఇక్కడ ఫస్ట్ షెడ్యూల్ ఎలా పూర్తి చేసారా అని అందరికి అనుమానం వచ్చింది. నిజానికి చరణ్ ఈ షెడ్యూల్ లో మాత్రమే అందుబాటులో లేడట. అందువల్ల తన కాంబినేషన్ సీన్లు లేని ఇతర ఆర్టిస్టులతో తీసేసి చైల్డ్ ఎపిసోడ్ కూడా పూర్తి చేసినట్టు తెలిసింది. రంగస్థలంలో పూజా హెగ్డే తో చేయాల్సిన ఐటెం సాంగ్ ఇంకా హైదరాబాద్ లో షూట్ చేయాల్సి ఉంది. దానితో మొత్తం షూటింగ్ పూర్తయిపోతుంది. తర్వాత బోయపాటి శీను సినిమా కోసం గెడ్డం తీసేసి కొత్త గెటప్ లోకి మారతాడు చెర్రి. ఇదంతా ముదస్తు ప్లానింగ్ ప్రకారమే జరిగిందని చరణ్ ముదుగానే బోయపాటి శీనుకి చెప్పి ఫిబ్రవరిలో తన కాల్ షీట్స్ ప్లాన్ చేయమని చెప్పాడట. ఇందులో నిజమెంతున్నా చరణ్ ప్లానింగ్ విషయంలో ఇంకా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం చాలా ఉంది. రంగస్థలం గత ఏడాది దసరాకు విడుదల ప్లాన్ చేసి షూటింగ్ మొదలు పెట్టారు. కానీ సంక్రాంతికి కూడా సిద్ధం చేయలేకపోయారు. దానికి తోడు సుకుమార్ కొంత భాగం రీ షూట్ చేయాలనీ కోరడంతో క్వాలిటీ కోసం రాజీ పడకుండా రామ్ చరణ్ కూడా అదనంగా డేట్స్ ఇచ్చాడనే టాక్ కూడా ఉంది. రీ షూట్ కు కారణం మాత్రం బయటపడనివ్వలేదు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జరిగే సింగల్ షెడ్యూల్ లో పాటతో సహా మొత్తం షూటింగ్ పూర్తయిపోతుంది. దాని తర్వాత గ్యాప్ ఇవ్వకుండా రామ్ చరణ్ బోయపాటి శీను తో జత కడతాడు.

రంగస్థలం తరహాలోనే బోయపాటి శీను సినిమా మీద కూడా పలు కథనాలు వెలువడుతున్నాయి. రాజస్తాన్ బ్యాక్ డ్రాప్ లో టూ షేడ్స్ ఉన్న పాత్ర చరణ్ చేస్తున్నాడని రాజవంశస్తుడిగా ఒకటి అల్లరి చేసే దొంగ పాత్రలో మరొకటి ఉంటాయనే టాక్ ఉంది. ఇది నిజమనే ఆధారాలు ఏమి లేవు కాని బోయపాటి దీన్ని తన స్టైల్ ఎమోషన్స్ మిక్స్ చేస్తూనే ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తీయబోతున్నట్టు టాక్. కైరా అద్వాని చరణ్ కు జోడిగా నటిస్తుండగా దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నాడు.



మళ్లీ కొడుకుతోనే ఆ దర్శకుడు!!



కొత్త హీరోలను లాంఛ్ చేయడం అంటే.. ఈ జనరేషన్‌లో దర్శకుడు పూరీ జగన్నాధ్ తర్వాతే ఇంకెవరైనా. అందుకే పలు భాషల నుంచి తమ కుర్రాళ్లను హీరోలుగా మార్చమంటూ పూరీకి పిలుపులు వస్తుంటాయి. కుదిరితే పూరీనే వీటిని తెరకెక్కి స్తుంటాడు.. లేదా పూరీ తీసిన ఓ హిట్టు సినిమా స్టోరీ రైట్స్ కొనుక్కోవడం ఆనవాయితీ అయిపోయింది.

గత కొంతకాలంగా బ్యాడ్ టైం ఎదుర్కొంటున్న పూరీ జగన్నాధ్.. ప్రస్తుతం తన కొడుకు ఆకాష్‌నే హీరోగా లాంఛ్ చేయడంలో బిజీగా ఉన్నాడు. మెహబూబా అంటూ రూపొందిస్తున్న మూవీ కోసం తన శాయశక్తులు అన్నీ ఒడ్డుతున్నాడు పూరీ. కొన్ని నెలలుగా ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటూ ఉండగా.. ఇప్పుడు తన తర్వాతి ప్రాజెక్టు కోసం కూడా పనులు మొదలుపెట్టేస్తున్నాడట ఈ ఫుల్ స్పీడ్ డైరెక్టర్. చక చకా సినిమాలు చేసేసే పూరీ నెక్ట్స్ సినిమాలో హీరో ఎవరా అని ఆరా తీస్తే.. ఆ చిత్రం కూడా తన కుమారుడు హీరోగానే చేయాలని పూరీ డిసైడ్ చేసుకోవడం ఆశ్చర్యంలో పడేసే విషయం.

సహజంగా పూరీ జగన్నాధ్ వరుసగా ఒకే హీరోతో సినిమాలు చేసిన హిస్టరీ లేదు. ప్రారంభంలో ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం, ఇడియట్ సినిమాలు రవితేజతో చేసినా.. ఇడియట్‌ను అప్పటికే కన్నడలో పునీత్ రాజ్ కుమార్‌తో తీసేశాడు. అదే సినిమాను మళ్లీ తెలుగులో దించాడంతే. అయితే.. తన స్టైల్‌కు తగినట్లుగా ఆకాష్ మారిపోతున్న తీరు సీన్ కు అనుగుణంగా ఒదిగిపోతున్న వైనం పూరీని ఆకట్టుకున్నాయట. అందుకే మొదటిసారి ఓ హీరోను తన తర్వాతి సినిమాలో కూడా తీసుకోనున్నాడట పూరీ జగన్నాధ్.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 8099492993**